
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అన్నమయ్య


జిల్లా వార్తలు

5

గురువారం 9 అక్టోబరు 2025


నాడు వెలవెల.. నేడు జలకళ

● నిండుకుండలా భోగంపల్లె రిజర్వాయర్



రెండు నెలల క్రితం నీటి చుక్క లేక...

వాల్మీకిపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం పట్టణానికి తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించే భోగంపల్లె రిజర్వాయర్ నీటి చుక్క లేక వెలవెలబోయింది. అయితే ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మదనపల్లె రూరల్ ప్రాంతంలోని చెరువుల నుంచి నీరు వచ్చి చేరడంతో ప్రస్తుతం నిండుకుండలా మారింది. రిజర్వాయర్‌కు నీరు చేరడంతో సమీప వ్యవసాయ రైతులు, ప్రజలు ఆనందంతో ఉన్నారు.



నేడు నిండుకుండలా భోగంపల్లె రిజర్వాయర్

స్వచ్ఛతతో సాధించారు...

● పీలేరు మండలానికి 4 స్వచ్ఛ ఆంధ్ర అవార్డులు ● అంగన్‌వాడీ కేంద్రం, ఆస్పత్రి, పాఠశాల, గ్రామ సమాఖ్యలకు...

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అందించిన స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో పీలేరు మండలం నాలుగు విభాగాల్లో జిల్లా స్థాయి అవార్డులు అందుకుంది. పీలేరు పట్టణం కామాటంవారిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రం స్వచ్ఛ అంగన్‌వాడీగా, 100 పడకల ఏరియా ఆస్పత్రి స్వచ్ఛ ఆస్పత్రిగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్వచ్ఛ పాఠశాలగా, ముడుపులవేముల గ్రామ సమాఖ్య (వీఓ) స్వచ్ఛ గ్రామ సమాఖ్యగా జిల్లా అవార్డులు అందుకున్నాయి.

స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల కోసం ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను 100 శాతం చేరుకోవడంతో ఆయా సంస్థలకు జిల్లా స్థాయి అవార్డులు దక్కాయి. ఇటీవల జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయా సంస్థల బాధ్యులకు జిల్లా ఉన్నతాధికారులు అవార్డులు అందజేశారు.

- పీలేరు (ఆంధ్రజ్యోతి)

పేదల పెన్నిధి ఆ ఆసుపత్రి

పీలేరులోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి పీలేరుతో పాటు పొరుగున ఉన్న కేవీ పల్లె, రొంపిచెర్ల, సదుం, కలకడ, పులిచెర్ల మండలాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య పెన్నిధిగా పేరుగాంచింది. ప్రతిరోజూ 600 మంది ఔట్ పేషెంట్లు, 60-70 మంది ఇన్ పేషెంట్లు, సగటున నెలకు 100 కాన్పులతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కుప్పం తరువాత అత్యుత్తమ సేవలు అందించే ఆసుపత్రిగా పీలేరుకు పేరు ఉంది. స్వచ్ఛ అవార్డుల ఎంపిక కోసం ప్రభుత్వం నిర్దేశించిన స్వచ్ఛ టాయిలెట్లు, స్వచ్ఛ వార్డుల విభాగంలో అన్నమయ్య జిల్లాలోని ఇతర ఆసుపత్రులతో పాటు జిల్లా స్థాయి అవార్డు సాధించింది.



అవార్డు బాధ్యత పెంచింది



స్వచ్ఛ అవార్డు మాపై మరింత బాధ్యత పెంచింది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మంచి సౌకర్యాలు ఉండవనే ప్రజల్లో ఉండే భావనను తొలగించాలన్న లక్ష్యంతో ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా పెడుతున్నాం. మా ఆర్‌ఎంవో డాక్టర్ సరస్వతమ్మ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనిచ్చి మాకున్న అరకొర సిబ్బందితోనే అవార్డు సాధించాం.

- డాక్టర్ చంద్రశేఖర్, పీలేరు ఆసుపత్రి సూపరింటెండెంట్

స్వచ్ఛ అంగన్‌వాడీగా కామాటంవారిపల్లె



పీలేరు పట్టణం కామాటంవారిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రం ఐదేళ్లుగా అన్నింటా ప్రథమ స్థానంలో నిలుస్తోంది. ఈ కేంద్రం పరిధిలో గర్భిణులు నలుగురు, బాలింతలు ముగ్గురు, టేక్ హోం రేషన్‌కు 20 మంది, 7 నెలల నుంచి మూడేళ్ల వయస్సున్న చిన్నారులు 20 మంది, మూడేళ్ల వయస్సు నుంచి ఆరేళ్ల వయస్సున్న చిన్నారులు 20 మంది ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వర్తింపజేయడమే కాకుండా అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛత పాటించినందుకు ప్రభుత్వం జిల్లా స్థాయిలో ఉత్తమ అంగన్‌వాడీ కేంద్రంగా ఎంపిక చేసింది.

అవార్డు రావడం సంతోషంగా ఉంది



స్వచ్ఛ ఆంధ్ర అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది. మా మేడం వాళ్లు చెప్పినట్లుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని శుభ్రంగా పెట్టుకోవడంతో పాటు ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను ఎప్పటికప్పుడు అందరికీ చేరవేస్తుండడంతో అవార్డు వచ్చింది. ఇక మీదట కూడా ఇలాగే పనిచేసి మంచిపేరు తెచ్చుకుంటాను. - రోజా రాణి, కామాటంవారిపల్లె అంగన్‌వాడీ కార్యకర్త

ఆదర్శం.. ఆ పాఠశాల

పీలేరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల సువిశాల ప్రాంగణంలో నడుస్తున్న ఈ పాఠశాలలో విద్యనభ్యసించిన వేలాది మంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్య, ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో ఉన్నతస్థాయిలో రాణిస్తున్నారు. ప్రాంగణంలో అనేక మొక్కలు నాటడంతో అవి నేడు వృక్షాలుగా మారి చిట్టడవిని తలపిస్తున్నాయి. విద్యార్థులు చెట్ల నీడలో ఆహ్లాదకర వాతావరణంలో విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో పరిశుభ్రతను ఉన్నతంగా నిర్వహిస్తున్నందుకు ప్రభుత్వం ఈ పాఠశాలను జిల్లా స్థాయి అవార్డుకు ఎంపిక చేసింది.



సమష్టి కృషికి ఫలితం



మా స్కూలుకు అవార్డు రావడంలో మా పూర్వ, ప్రస్తుత ఉపాధ్యాయుల సమిష్టి కృషి దాగి ఉంది. ప్రధానంగా పూర్వ హెచ్‌ఎంలు రంగనాథరెడ్డి, వీజీ నటరాజన్‌లు పాఠశాల ప్రాంగణంలో పచ్చదనం, పరిశుభ్రత నెలకొల్పేందుకు విశేష కృషి చేశారు. వారి స్ఫూర్తితో ఉపాధ్యాయులు, పిల్లలు మా పాఠశాలను పరిశుభ్రంగా పెట్టుకోగలుతున్నారు.

- పీలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రేమారాణి

పెరటి తోటల్లో ముడుపులవేముల టాప్

స్వయం సహాయక సంఘాల్లోని మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పెరటి తోటల పెంపకంలో ప్రథమ స్థానంలో నిలవడంతో ముడుపులవేముల గ్రామ సమాఖ్యకు జిల్లా స్థాయి అవార్డు లభించింది. ముడుపులవేముల సమాఖ్యలో మొత్తం 363 మంది సభ్యులు ఉండగా వారిలో 100 మంది సభ్యులు తమ ఇంటి అవసరాలకు సరిపోయే విధంగా కూరగాయలు, ఆకుకూరలను తమ పెరటి తోటల్లో సాగు చేసుకుంటున్నారు. ఆ సంస్థలోని 32 మంది స్వయంగా చిల్లర దుకాణాలు, పాడి ఆవు యూనిట్లు, వస్త్ర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.



పెరటి తోటల పెంపకాన్ని మరింత విస్తృతం చేస్తాం



పెరటి తోటల పెంపకం కారణంగా ముడుపులవేముల వీవోకు అవార్డు వచ్చింది. ఇదే స్ఫూర్తిని కొనసాగించి మండలంలోని ఇతర వీవో సభ్యులను చైతన్యపరచి పెరటి తోటల పెంపకాన్ని మరింత విస్తృతం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన చేకూరేలా పనిచేస్తాం.

- జవహర్‌బాషా, ఏపీఎం, పీలేరు మండలం

వామ్మో.. కుక్కలు

- పట్టణాల్లో ఎటుచూసినా గుంపులే
- ద్విచక్ర వాహనదారులను వెంటపడి...
- జిల్లాలో 3 వేల మందికి కుక్కకాటు
- అత్యధికంగా మదనపల్లెలో 806 మంది
- బెంబేలెత్తుతున్న ప్రజలు

6

బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యం

- దాడి చేసిన యువకులు
- ఆలస్యంగా వెలుగులోకి...



6

మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి



పీఆర్ మనోహర్

మదనపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీలో మేనేజర్‌గా పనిచేస్తున్న పీఆర్ మనోహర్‌కు గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం జీవో-210 జారీ చేసింది. ఈయనతో పాటు రాష్ట్రంలో మరో ఐదుగురికి కూడా పదోన్నతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి పది రోజుల్లో ప్రభుత్వం మున్సిపాలిటీలలో పోస్టింగ్ ఇవ్వనున్నట్లు తెలిసింది.

చిన్నారులు, ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం

● ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

రాయచోటిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని చిన్నారులు, ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం అని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా చెరువులు, నీటికుంటలు, బోరు వంటి ప్రమాదకర ప్రదేశాలకు పిల్లలను వెళ్లనీయకూడదని హెచ్చరించారు. అలాగే సైబర్ క్రైం, సోషల్ మీడియా మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పేకాట, కోడిపందాలు, గంజాయి, అక్రమ మద్యం, నాటుసారా తయారీ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధానంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో కేసులు, వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాలోని పోలీసు అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఎక్కడైనా గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల సహకారంతోనే నేరాలను అరికట్టవచ్చని, ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం అన్నారు.

మహిళా ప్రపంచకప్ క్రికెట్ స్కోరర్‌గా రామకృష్ణ



రామకృష్ణ

వాల్మీకిపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో గురువారం జరగనున్న ఐసీసీ మహిళా క్రికెట్ ప్రపంచకప్ పోటీకి స్కోరర్‌గా వాల్మీకిపురం వాసి బి.రామకృష్ణ ఎంపికైనట్లు జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్ తెలిపారు. విశాఖపట్నంలో ఈనెల 9న ఇండియా-సౌతాఫ్రికా, 12న ఇండియా-ఆస్ట్రేలియా, 13న సౌతాఫ్రికా-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరగనున్న మ్యాచ్‌లకు రామకృష్ణ స్కోరర్‌గా వ్యవహరించనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వాల్మీకిపురం నుంచి క్రికెట్ ఆడుతూ తర్వాత స్కోరర్‌గా చిత్తూరు జిల్లా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పరీక్షల్లో ప్రతిభ కనబరిచి పదేళ్లుగా స్కోరర్‌గా కొనసాగుతున్నానన్నారు. ప్రస్తుతం మహిళా ప్రపంచ కప్ పోటీలకు స్కోరర్‌గా అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● కలెక్టర్ నిశాంత్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మధ్యాహ్న భోజన పథకంలో ప్రతిరోజూ ఒక ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయురాలు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, సాంఘీక సంక్షేమశాఖ గిరిజన సంక్షేమశాఖ, జిల్లా విద్యాశాఖ తదితర శాఖల అధికారులు, వివిధ మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఆర్‌వో నీటిని వాడాలని తెలియజేశారు. విద్యార్థినీ, విద్యార్థులు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని గమనిస్తూ ఉండాలని తెలిపారు. వారం రోజుల పాటు అధికారులందరూ హాస్టళ్లు, పాఠశాలల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో చేనేత కార్మికుడు మృతి

6

చీటీల నిర్వాహకుడు పరార్

● రూ.4 కోట్ల మేర బకాయిలు

మదనపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో చీటీల నిర్వాహకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు రూ.4 కోట్ల మేర బాధితులకు కుచ్చుటోపీ పెట్టి పరారయ్యాడు. అయిదు రోజుల అనంతరం అతను బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి బాధితులు మదనపల్లెకు తీసుకొచ్చారు. తమకు వచ్చే వేతనంలో కొంత భవిష్యత్తు అవసరాల నిమిత్తం ఎంతోమంది నెలనెలా చీటీలు వేశారు. కొన్నేళ్లుగా చీటీలు వేస్తూ నమ్మకంగా తిరిగి చెల్లింపులు చేస్తుండటంతో వారితో పాటు వారికి తెలిసిన మిత్రులు, స్నేహితులు, బంధువుల వద్ద కూడా వేయించారు. ఇలా నిర్వాహకుడి నుంచి 90 మందికిపైగా రూ.4 కోట్ల మేర సొమ్ములు రావాల్సి ఉందని చెబుతున్నారు. ఆరు నెలలుగా చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో అవసరాల కోసం చీటీలు ఎత్తిన వారి నుంచి, రుణదాతల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో నిర్వాహకుడు అయిదు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బాధితులు ఇంటికి క్యూకట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. బెంగళూరులో ఉన్నట్లు గుర్తించి ఇంటికి తీసుకొచ్చారు. పోలీసులకు ఫిర్యాదు చేయడం కంటే సామరస్యంగా మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకుందామనే రీతిలో పంచాయితీ పెట్టారు. మదనపల్లె పట్టణం ప్రశాంత్‌నగర్‌లో నివాసముంటున్న ఓ ఉపాధ్యయుడు చీటీల డబ్బులు చెల్లించలేనని చేతులెత్తేశాడు. మదనపల్లె, బి.కొత్తకోట మండలాల్లో పనిచేసిన ఆయన ప్రస్తుతం తంబళ్లపల్లె మండలంలో టీచర్‌గా పనిచేస్తున్నాడు. 15 ఏళ్లకుపైగా చీటీలు వేస్తూ అందరికీ నమ్మకం కలిగించాడు. ఇలా రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకూ చీటీలు వేసేవాడు. మొదట్లో బాగానే ఉన్నా తర్వాత అతడికి అప్పులు ఎక్కువ కావడంతో చెల్లింపులు చేయలేనని చేతులెత్తేసినట్లు చెబుతున్నారు. బాధితులైన సహచర ఉపాధ్యాయుల అధీనంలో ఉన్నట్లు తెలిసింది. వారంతా జాబితా సిద్ధం చేస్తే 90 మందికి రూ.4 కోట్ల మేర అప్పులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. చీటీల నిర్వాహకుడికి కురబలకోట మండలం అంగళ్లు, మదనపల్లె సరస్వతీనగర్ ఏరియాలో మొత్తం మూడు ప్లాట్లు ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం వీటిని అమ్మినా..రూ.కోటిలోపే ఉంటుందని, మిగిలిన సొమ్ముల పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

ఉపాధిలో కమిట్‌మెంట్ దోపిడీ

- పనికే రావద్దు నీకింత.. నాకింత...
- బిల్లు పడాలంటే రూ.200 ఇవ్వాల్సిందే
- ఫీల్డ్ అసిస్టెంట్‌ల నిర్వాకం

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు కమిట్‌మెంట్ దోపిడీకి పాల్పడుతున్నారు. క్షేత్రస్థాయిలో ఎన్ని చర్యలు చేపట్టినా సంబేపల్లె మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పద్ధతి ఇంతేనంటూ దోపిడీకి పాల్పడుతూనే ఉన్నారు. రాయచోటి మండలంలో కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు భార్య, భర్తలతో పాటు కొంతమంది ఉద్యోగులకు జాబ్‌కార్డు ఇచ్చి పనులకు వెళ్లినట్లు బిల్లులు చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సామాజిక తనిఖీల పేరుతో పనులపైన పరిశీలనలు చేపట్టినా ఫీల్డ్ అసిస్టెంట్లు తమ పని కానిచ్చేస్తున్నారు. పై స్థాయి అధికారులు కూడా కూలీల సంఖ్య పెంచారా లేదా అని మాత్రమే చూస్తున్నారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న దోపిడీని తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కూలీలతో కమిట్‌మెంట్ దోపిడీ

క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీలతో కమిట్‌మెంట్ దోపిడీకి పాల్పడుతున్నారు. పనికి రాకపోయినా వచ్చినట్లు మస్టర్‌లో హాజరు వేయడం, దీంతో వచ్చిన డబ్బుల్లో నీకింత, నాకింత అంటూ పంచుకోవడం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పనికి పోకపోయినా కూలి డబ్బులు ఎంతో కొంత వస్తుండడంతో దోపిడీపై ప్రశ్నించడం లేదు. ఈ కమిట్‌మెంట్ ప్రకారం వారానికి ఒక ఫీల్డ్ అసిస్టెంట్ 20 మంది పనులకు రాకపోయినా వారి పేర్లతో హాజరు వేస్తే ఒక్కో వ్యక్తి వారానికి రూ.1500 కూలి వస్తే నాలుగు వారాలకు రూ.6 వేలు ఇలా 20 మంది కూలీల వద్ద సగం తీసుకున్నా నెలకు రూ.50 నుంచి 60 వేలు సంపాదిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

కూలి అకౌంట్‌లో పడాలా అయితే రూ.200 ఇవ్వాల్సిందే

మీరు చేసిన పనికి కూలి పడాలంటే వారానికి రూ.200 చెల్లిస్తే మీ కూలి పెంచి వేస్తాం లేదంటే మీరు చేసిన పనికి వారానికి రూ.400 నుంచి 600 లోపు వస్తుంది. రూ.200 ఇస్తే రూ.1300 నుంచి 1500 రూపాయల వేస్తామని కొందరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు కూలీలను బెదిరించి దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా తాము మాత్రం నిజాయతీగా ఉన్నామంటూ క్షేత్రస్థాయిలో జరిగే వాటికి సంబంధం లేదంటూ పైస్థాయి అధికారులు చెప్పడం విశేషం. ఉపాధి హామీలో కూలీలతో కమిట్‌మెంట్ దోపిడీ విషయంపై ఎంపీడీవో రెడ్డిజవహర్‌ను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి రాలేదని విచారించి పరిశీలిస్తామని తెలిపారు.



గుట్టలో కందకాల పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

భూసమస్యలపై నిర్లక్ష్యం తగదు

● జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

గుర్రంకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలపై కార్యాలయానికి వచ్చే రైతుల పట్ల రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం చేయకుండా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. బుధవారం గుర్రంకొండ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన జేసీ మాట్లాడుతూ మండలంలో భూసమస్యలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని, రెవెన్యూ సిబ్బంది పనితీరు సరిగా లేకపోవడంతోనే సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలోనే రెవెన్యూ సిబ్బంది భూసమస్యలపై ప్రత్యేక చొరవ చూపి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తరిగొండలో జరిగిన ఫ్రీహోల్డ్, రీసర్వేలో అక్రమాలు జరిగినట్లు పలువురు రైతులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అర్హులైన రైతులకు ఫ్రీ హోల్డ్‌లో న్యాయం జరిగేలా చూడాలన్నారు. అలాకాకుండా అనర్హులకు ఫ్రీహోల్డ్ ముసుగులో భూములను కట్టబెడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వేను పకడ్బందీగా చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పలువురు రైతులు భూమి, దారి సమస్యలపై జేసీకి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు పట్టణంలోని రేషన్ దుకాణం-3ని తనిఖీ చేసి బియ్యం, చక్కెర పరిమాణం, నాణ్యతలను పరిశీలించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై వివరాలను సేకరించి సమస్యలు లేకుండా చూడాలని తహసీల్దార్ లక్ష్మీప్రసన్నకు సూచించారు.



రైతుల సమస్యలు వింటున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

లారీ ఢీకొని యువకుడు మృతి


మహేంద్ర (ఫైల్‌ఫొటో)

రైల్వేకోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానదారిలో మంగళవారం రాత్రి 11 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేకోడూరు పోలీసుల వివరాల మేరకు.. రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకుల పేటకు చెందిన బొక్కసం మహేంద్ర (27) అనే యువకుడు తన మోటారు సైకిల్‌లో బుధవారం తిరుపతి వైపు వెళుతుండగా వెనక వైపు నుంచి ఓ లారీ అతి వేగంగా వచ్చి ఢీకొని వెళ్లింది. దీంతో మహేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఎడమ చేయి పూర్తిగా తొలగిపోయింది. నడుము భాగంలో బలమైన గాయాలయ్యాయి. లారీని అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు శవాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి రైతు..


జనార్దన్ మృతదేహం

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సంబే పల్లె మండలం శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లికు చెందిన రైతు నల్లబోతుల జనార్ధన (50) మిల్లర్ రిపేర్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కింద పడి బుధవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... జనార్ధన్ తన సొంత ట్రాక్టర్‌తో ఉలవపంట సాగు కోసం పొలానికి వెళ్లినట్లు తెలిపారు. మిల్లర్ బ్లేడ్లు ఊడిపోవడంతో ట్రాక్టర్ ఆపి బిగిస్తూ ఉండగా అనుకోకుండా ట్రాక్టర్ వెనక్కు రావడంతో రైతు ట్రాక్టర్ కిందపడినట్లు తెలిపారు. పొలం దగ్గరలో ఉన్న గ్రామస్థులు గుర్తించి అతన్ని చికిత్స నిమిత్తం రాయ చోటి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు కలరు. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. అడవికమ్మపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..


ధనంజయ (ఫైల్‌ఫొటో)

పీలేరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇందిరమ్మ కాలనీలో నివాసముం టున్న పి.ధనుంజయ(29) జేసీబీ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడేళ్ల క్రితం పావనితో వివాహమైంది. తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పాటు పిల్లలు కలగకపోవడంతో ధనంజయ తీవ్ర మనస్థాపానికి గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం భార్య తన పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను ఆదివారం ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో మంగళవారం రాత్రి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ రహీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆత్మహత్య చేసుకున్న రాజస్థాన్ వాసి..

బి.కొత్తకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం బి.కొత్తకోటలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... రాజస్థాన్‌లోని బాలహోత్రా జిల్లా, శివన గ్రామానికి చెందిన ఉత్తంసింగ్ కుమారుడు విక్రంసింగ్(26) బి.కొత్తకోటలోని పోకనాటివీధిలో ఓ అద్దెగదిలో వుంటూ స్థానికంగా ఉన్న ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో పనిచేసుకుంటున్నాడు. మంగళవారం షాపుకు సెలవు కారణంగా రూములోనే వున్నాడు. ఇతని చెల్లెలు ఫోన్‌చేయగా ఎంతకూ తీయకపోవడంతో అనుమానం వచ్చి ఇక్కడే ఉంటున్న తమ బంధువును రూం వద్దకు పంపింది. అతను వెళ్లి చూడగా నైలాన్‌తాడుతో ఫ్యానుకు ఉరివేసుకొని మృతిచెంది వుండటం గమనించాడు. మృతుడి చెల్లెలు నిర్మలకన్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ వికటించి వృద్ధురాలు..


గంగులమ్మ మృతదేహం

మదనపల్లెటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తుంటి ఎముక విరిగి ఆపరేషన్ చేయిం చుకున్న ఓ వృద్ధురాలి ప్రాణాలకే ఎసరు వచ్చింది. వైద్యుడు చేసిన ఆపరేషన్ వికటించి ఆమె మృతి చెందింది. వివరా ల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం ఘాజీపేటకు చెందిన గంగప్ప భార్య గంగులమ్మ(60) ఇంట్లో కాలుజారి కిందపడటంతో తుంటి ఎముక విరిగింది. దీంతో ఆమెను మదనపల్లె సొసైటీ కాలనీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు శస్త్రచికిత్స చేయడానికి ఆరోగ్యశ్రీ కింద ఈ నెల 4న ప్రభుత్వ అనుమతులు రావడంతో ఆ ఆస్పత్రిలో కాకుండా పట్టణంలోని సుందరరాజ్ పెట్రోల్‌బంక్ ఎదురుగా వున్న వీధిలోని మరో ప్రైవేటు ఆస్పత్రిలో ఈ నెల 7న గంగులమ్మకు ఇద్దరు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆరోజునే గంగులమ్మకు ఆపరేషన్ వికటించి ఆయాసం ఎక్కువ కావడంతో, ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ నేపథ్యంలో బుధవారం గంగులమ్మ మృతికి వైద్యులే కారణమంటూ ఆమె కుటుంబీకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వన్‌టౌన్ సీఐ మహ్మద్‌రఫీ, ఎస్‌ఐ శివకుమార్ ప్రైవేటు ఆస్పత్రికి చేరుకుని బాధితులను విచారించారు. కాగా ఈ సంఘటనపై కేసు నమోదు కానట్లు తెలిసింది.

విద్యార్థిపై మూకుమ్మడి దాడి

● 108లో మదనపల్లెకు తరలింపు

బి.కొత్తకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అంగళ్లలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకునే విద్యార్థుల బృందం హార్సిలీహిల్స్‌కు వెళ్లారు. వీరిలో కొందరి మధ్య వివాదం తలెత్తింది. పరస్పరం ఘర్షణ పడ్డారు. వీరిలో ములకలచెరువు మండలం పర్తికోటకు చెందిన వివేక్‌పై మిగతా విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో వివేక్‌కు రక్త గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థి ఆస్పత్రిలో చేరాడు. స్థానిక అవుట్‌పోస్టు సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. కాగా హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రక్షణకు పోలీసు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోనే తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

కామ్మో.. కుక్కలు...!

● పట్టణాల్లో ఎటుచూసినా గుంపులే
● ద్విచక్రవాహనదారులను వెంటపడుతున్న వైనం
● జిల్లాలో 3 వేల మందికి కుక్కకాటు
● అత్యధికంగా మదనపల్లెలో 806 మంది
● బెంబేలెత్తుతున్న ప్రజలు ● అధికార యంత్రాంగం విఫలం




రాయచోటిలో గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు

రాయచోటిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోజురోజుకు కుక్కకాటుకు గురయ్యేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుంపులుగా చేరి ప్రజలపై దాడి చేస్తుండడంతో జనం భయాందోళన చెందుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ప్రతిరోజు ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్కకాటు బారిన పడుతూనే ఉన్నారు. కుక్కల బెడద నివారించేందుకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలోని ప్రధాన పట్టణాలైన రాయచోటి, మదనపల్లి, పీలేరు, రాజంపేట, కోడూరు, తంబళ్లపల్లె, వాయల్పాడు లాంటి ప్రాంతాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల వెంబడి గుంపులుగా తిరుగుతున్న కుక్కలు చిన్న, పెద్ద అనే తేడా లేకుండా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆడుకుంటున్న చిన్నపిల్లలపై రక్తస్రావమయ్యేలా దాడి చేస్తున్నాయి. దీంతో పిల్లల తల్లిదండ్రులు హుటాహుటిన ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. అంతేకాకుండా వీధుల్లో గుంపులుగా చేరి ద్విచక్ర వాహనదారులను వెంటపడుతుండడంతో వారు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా జూన్ 1 నుంచి ఆగస్టు 31వ తేది వరకు 2,929 మంది కుక్కకాటుకు గురైనట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 1841 మంది పురుషులు, 1088 మంది మహిళలు గాయపడిన వారిలో ఉన్నారు. ఇందులో అత్యధికంగా మదనపల్లి ప్రాంతంలో 806 మంది, రాయచోటి ప్రాంతంలో 295 మంది, చిట్వేలి ప్రాంతంలో 272 మందికి కుక్కకాటుకు గురికావడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలపై సైతం కుక్కలు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. ఏదేమైనప్పటికీ జిల్లాలో కుక్కలను అదుపు చేయడంలో సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడం లేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుక్కలతో భయమేస్తోంది

● నాగేశ్వరరావు, రాయచోటి



వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్న పిల్లలను స్కూల్‌కు, ట్యూషన్‌కు ఒంటరిగా పంపించాలంటే భయమేస్తోంది. మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి.

వాహనాల వెంటపడుతున్నాయి

● శ్రీరాములు, బాధితుడు, రాయచోటి



పట్టణంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా కుక్కలు వాహనాల వెంటపడుతున్నాయి. అసలు ఒంటరిగా వెళ్లలేకున్నాం. మున్సిపల్ అధికారులు కొన్ని వీధులకే పరిమితమయ్యారు. కుక్కలకు వ్యాక్సిన్ వేయడం లేదు.

టీకాలు అందుబాటులో ఉన్నాయి

● డాక్టర్ లక్ష్మినరసయ్య, డీఎంఅండ్‌హెచ్‌వో

జిల్లా వ్యాప్తంగా ప్రతి పీహెచ్‌సీ సెంటర్‌లో టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్కకాటుకు గురైనా, గాయాలపాలైనా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యుల సూచనల మేరకు టీకాలు వేయించుకోవాలి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యం

● ఆపై దాడి చేసిన యువకులు
● ఆలస్యంగా వెలుగుచూసిన వైనం


కండక్టర్‌పై దౌర్జన్యం చేసేందుకు బస్సు ఎక్కుతున్న యువకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాజంపేట డిపోకు చెందిన ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ప్రయాణికులు దౌర్జన్యం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకెళ్తే.. పల్లె వెలుగు బస్సు ఈ నెల 5వ తేదిన సాయంత్రం రాజంపేట నుంచి తిరుపతికి వెళ్తోంది. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరు మీదుగా 125 మంది ప్రయాణికులతో వెళ్తుండగా శెట్టిగుంట దగ్గర ప్రయాణి కులు బస్సును ఆపారు. కానీ సీట్లు లేకపోవడంతో డ్రైవర్ బస్సు ఆపలేదు. దీంతో ఆగ్రహించిన శెట్టిగుంటకు చెందిన కొందరు యువకులు ద్విచక్ర వాహనాలతో వెంబడించి బస్సు డ్రైవర్‌పై దాడికి దిగడమే కాకుండా కండక్టర్‌పై దుర్భాషలాడారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో బుధవారం హల్‌చల్ చేయడంతో రైల్వేకోడూరు పోలీసులు విచారిస్తున్నారు. జరిగిన సంఘటనపై విచారించేందుకు రాజంపేట ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌లను పోలీస్‌స్టేషన్‌కు రమ్మన్నామని, వారు వచ్చిన తర్వాత పూర్తి సమాచారం తెలుస్తుందని ఎస్‌ఐ పీఎల్ ప్రసాద్‌రెడ్డి వివరించారు. కాగా రాజంపేట డిపోలో బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసనగా బస్సు డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి / ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యమే కారణమా ?


మృతిచెందిన రంజిత్‌కుమార్

మదనపల్లెటౌన్/నిమ్మనపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో కోసుకుపోయిన రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులు చేయని కారణంగా ఓ నిండు ప్రాణం గాల్లో కలసి పోయింది. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె- నిమ్మనపల్లె మధ్య ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పలుచోట్ల గుంతలు పడడంతో పాటు, ఇరుకు రోడ్డు వుండటంతో ఇరువైపులా రోడ్డు కోసుకుపోయింది. ఈ క్రమంలో నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన చంద్రశేఖర్, రెడ్డిరాణి దంపతుల కుమా రుడు రంజిత్‌కుమార్ (20) డిగ్రీ చదువుకుంటూ, ఓ ఫొటో స్టూడియోలో ఎడిటింగ్ కోర్సు నేర్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రంజిత్‌కుమార్ ద్విచక్రవాహనంలో తవళం నుంచి మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలో వశిష్ట హైస్కూల్ వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును రంజిత్ ఓవర్‌టేక్ చేశాడు. తారు రోడ్డు దిగి, తిరిగి రోడ్డు ఎక్కుతున్న రంజిత్ ద్విచక్రవాహనం బెర్మ్ సరిగ్గా లేకపోవడంతో జారి పడిపోయింది. ఈ ఘటనలో రంజిత్ తారు రోడ్డుమీద పడిపోవడం, వెనక వస్తున్న ఆర్టీసీ బస్సు రంజిత్ శరీరంపై ఎక్కడం ఒక్కసారిగా జరిగిపోయాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంజిత్‌కుమార్‌ను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించి రంజిత్ మృతిచెందాడు. దీంతో తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుడి కుటుంబీకులను ఓదార్చారు. కాగా ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే విద్యార్థి ప్రాణాలు పోయాయని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ ఆరోపించారు.

డ్రోన్ కెమెరాతో నిఘా

● ఐదుగురు కోడిపందెంరాయుళ్ల అరెస్టు

రామసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, జూదం అరికట్టేందుకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి చేపట్టిన డ్రోన్‌తో తనిఖీలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచిన రామసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో పూలగుంట్లపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా జరుగుతున్న కోడి పందేలను గుర్తించామన్నారు. కోడి పందేల స్థావరం వద్దకు వెళ్లిన డ్రోన్‌ను చూడగానే, కోడిపందెం రాయుళ్ల ద్విచక్ర వాహనాలను అక్కడే వదిలేసి కొండలు, గుట్టల గుండా పరుగులు తీశారు. వీరిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని సంఘటన స్థలం నుంచి ఆరు ద్విచక్రవాహనాలు, ఒక పందెం కోడి స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.


కోడిపందేలు ఆడుతున్న స్థావరం వద్దకు డ్రోన్‌ను పంపుతున్న ఎస్‌ఐ

అనుమానాస్పద స్థితిలో చేనేత కార్మికుడు మృతి

మదనపల్లెటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ చేనేత కార్మికుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. కలకడ మండలం నడిమిచెర్లకు చెందిన రెడ్డెప్ప కుమారుడు సుంకరరెడ్డి(42) మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సుంకరరెడ్డి గత కొంత కాలంగా మద్యానికి బానిసై, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో సుంకరరెడ్డి భార్య జయమ్మ కుమార్తె, అల్లుడితో కలసి మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లారు. బుధవారం మదనపల్లెకు తిరిగి వచ్చి ఇంటి తలుపులు వేసి వుండటంతో భర్త సుంకరరెడ్డిని పలుమార్లు పిలిచింది. ఎంతసేపటికి ఇంటి తలుపులు తెరవకపోవడంతో పాటు ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇంటి తలుపులు పగులకొట్టి లోనికి వెళ్లి పరిశీలించగా సుంకరరెడ్డి మృతదేహం కనపడింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతిగా మద్యం సేవించి మృతి చెందాడా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి వుంది.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి: డీఈవో

రాయచోటిటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన దృక్పథం పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష ఉపయోగపడుతుందని డీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులతో కలిసి చెకుముకి సంబరాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు తోడ్పడతాయన్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పనిసరిగా ఈ సంబరాల్లో పాల్గొనేలా చొరవ చూపాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ మాట్లాడారు. జిల్లాలోని 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు సైన్స్ సంబరాల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ సంబరాలు పాఠశాల స్థాయిలో అక్టోబరు 18న, మండల స్థాయిలో నవంబరు 1న జిల్లా స్థాయిలో 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14వ తేదీల్లో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాశ్‌రెడ్డి, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, ఐఈడీ కోఆర్డినేటర్ జనార్ధన్, ప్రధానోపాధ్యాయుడు శివయ్య, రెడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళపై చీటింగ్ కేసు నమోదు

గాలివీడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన బాబాబీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని నూలివీడు గ్రామం వడ్లపల్లికి చెందిన రాళ్లపల్లి బాబాబీ అనే మహిళ ఎస్పీ కార్యాలయంలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి నూలివీడు గ్రామం నాగూరువాండ్లపల్లెకు చెందిన రామచంద్ర కుమార్తె శారద వద్ద బంగారం రూపంలో రూ.7 లక్షలు, నగదుగా రూ.11.50 లక్షలు మొత్తం రూ.18.50 లక్షలు తీసుకొని ఎలాంటి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసిందని బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఘటనపై గాలివీడు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్లకు ఎంపిక


జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులు

సుండుపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఉమ్మడి కడప జిల్లా టీంలకు సుండుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ రాధారాణి తెలిపారు. బుధవారం కడప జిల్లాలోని పోరుమామిళ్లలో ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో రాష్ట్ర జట్టు ఎంపికల కోసం సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సాఫ్ట్‌బాల్ అండర్-19 బాలికల విభాగంలో బేబీ, బాలుర విభాగంలో ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తమ ప్రతిభను చాటి సెలెక్టర్ల దృష్టిలో పడ్డారు. బేస్‌బాల్ బాలికల విభాగంలో శ్రీలత, బేబి, బాలుర విభాగంలో భరత్ సత్తా చాటారు. దీంతో వీరికి సెలెక్టర్లు జిల్లా జట్లలో స్థానం కల్పించారు. వెంకటేశ్వర్లను బేస్‌బాల్ జట్టులో స్టాండ్ బైగా తీసుకున్నారు.

విద్యార్థి ఘటనపై విచారణ


విద్యార్థితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత నెలలో రిషివాటిక గురుకులంలో జరిగిన సంఘటనలో శేషాద్రిరెడ్డి అనే విద్యార్థికి కంటి చూపు పోయింది. ఈ మేరకు బుధవారం డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మి న ర స య్య విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహించి చూపు పూర్తిగా దెబ్బతినిందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డకు న్యాయం చేయాలని జిల్లా అధికారిని కోరారు. ఈ మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మినరసయ్య పిల్లవాడికి న్యాయం జరిగేలా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుల్లెట్‌వాహనాన్ని లారీ ఢీకొనడంతో
ఇద్దరి దుర్మరణం



హాజీవల్లి, రామ్మోహన్ మృతదేహాలు, (ఫైల్ ఫొటోలు)

ముద్దనూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎర్ర గుంట్ల రోడ్డులోని కొత్తపల్లె సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత బుల్లెట్ వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలిలా... చింతకొమ్మదిన్నె మండలం సుగాలి బిడికి గ్రామానికి చెందిన రామ్మోహన్(35), చిలమకూరు గ్రామానికి చెందిన హాజీవలి (31) లారీ డ్రైవర్లు. వీరు ముద్దనూరులో భోజనం చేసుకొని బుల్లెట్ వాహనంపై చిలమకూరు వద్ద ఉన్న సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు వెళుతున్నారు. ముద్దనూరు వైపు నుంచి బళ్లారి నుంచి చైన్నెకి ఐరన్ వోర్ మట్టిని తరలిస్తున్న లారీ కొత్తపల్లె గ్రామ సమీపంలోని సున్నపురాళ్లపల్లె క్రాస్ వద్ద బుల్లెట్‌ను వెనుక వైపు ఢీకొంది. దీంతో హాజీవలి సంఘటనా స్థలంలో మృతి చెందగా, రామ్మోహన్‌ను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు లారీని గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



నూర్జహాన్ మృతదేహం

చాపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అండ్లగుత్తి నూర్జహాన్ (59) అనే మహిళ బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాల మేరకు.. నూర్జహాన్ తన ఇంటి బయట బట్టలు ఉతుకుతుండగా చెక్కబోర్డు (నీళ్ల మోటారుకు సంబంధించిన బోర్డు)పై నీళ్లు పడ్డాయి. గమనించిన ఆమె బోర్డుకు ఉన్న ప్లగ్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై ఈ ప్రమాదం జరిగిందన్నారు. నూర్జహాన్ మృతితో ఆమె భర్త మహమ్మద్, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు



శిక్ష పడ్డ ఖైదీతో పోలీసులు

కడప క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రకాశ్ నగర్‌లోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసుకు సంబంధించి నిందితుడు మల్లికార్జునకు జీవిత ఖైదుతో పాటు వంద రూపాయలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని బుధవారం తీర్పునిచ్చినట్లు కడప వన్‌టౌన్ సీఐ రామ క్రిష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు... కడప మారుతీనగర్‌కు చెందిన మల్లికార్జున ఈడీ ఎంఎంస్ స్కానింగ్ సెంటరు నిర్వహిస్తుండే వాడు. అతని వద్ద కంప్యూటరు ఆపరేటర్‌గా కడప నిరంజన్‌నగర్‌కు చెందిన చిట్టివేలి భవాని శంకర్ పనిచేస్తుండేవాడు. ఈక్రమంలో మల్లికార్జున భార్యతో భవాని శంకర్‌కు వివాహేతర సంబంధం ఉందని అనుమానించేవాడు. ఈ క్రమంలో 2023 నవంబరు 11న మల్లికార్జున తన ఆఫీసు వద్దకు రావాలని భవానీ శంకర్‌ను పిలిపించుకుని ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తనతో తెచ్చుకున్న మచ్చుకత్తితో భవానీ శంకర్‌ను విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. మృతుడి భార్య బాబాబి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ నాగరాజు కేసు నమోదు చేసి, మల్లికార్జునను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జడ్జి యామిని నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు వంద రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కదీరున్నీసా వాదించారని సీఐ తెలిపారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

కొండాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిపాడు గ్రామంలో నలుగురు కోడిపందెం రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వెంకయ్యకాలువ రోడ్డులో కోడిపందెం ఆడు తున్న నలుగురి నుంచి రూ.3,850 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనపరుచుకున్నట్లు కొండాపురం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

కడప క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మాసాపేటకు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైనట్లు రిమ్స్ సీఐ రామక్రిష్టారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప మాసాపేటకు చెందిన హర్షవర్ధన్ కడప నగరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్నేహితులతో కలిసి రాజంపేట రోడ్డులోని వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద దిగి అదృశ్యమయ్యాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని...

పోరుమామిళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె కనిపించడం లేదని రజక వీధికి చెందిన మహిళ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోరుమామిళ్లలోని రజకవీధిలో నివాసం ఉంటున్న 17 సంవత్సరాల బాలిక మంగళవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

ఒక్కరోజు వాన

- ఎకరాకు రూ.5వేలు నష్టం
- తడిసిన మొక్కజొన్నలు
- తగ్గిన ధర... రైతుల ఆవేదన

రాజుపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం అష్ట కష్టాలు పడి పంటలు పండించిన రైతన్నలను నష్టాలు ఏదోక రూపంలో వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆరబెట్టుకునేందుకు రోడ్లపైకి తోలారు. అయితే సోమవారం ఉదయం భారీ వర్షం పడడంతో మొక్కజొన్నలు తడిసి ముద్ద య్యాయి. దీంతో మరుసటిరోజు తెరిపి రావడంతో పంటను ఆరబెట్టుకు నేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఇక ధర ఒక్క రోజులోనే క్వింటా రూ.2200 పలుకుతున్న మొక్కజొన్నలు రూ.1700కు పడిపోయాయి. దీంతో రైతుకు ఎకరాకు రూ.5వేలు నష్టం వచ్చిందని, మూడునెలలు పంటను అన్నివిధాలుగా రక్షించుకుని తీరా చేతికొచ్చే సమయంలో ఒక పక్క రేటు లేకపోవడం, మరో పక్క వర్షానికి నానడంతో రైతులు దిగులు చెందుతు న్నారు. ఇంకా దాదాపు 300 ఎకరాల్లో పంట కోత దశలో ఉంది. వర్షం పడకపోతే నూర్పిళ్లు జరుగుతాయని, అధిక వర్షం పడితే పంట దెబ్బతిం టుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండురోజులు వర్షం పడకపోతే కొంత మేరగట్టెక్కవచ్చని రైతులు అంటున్నారు.2 తడిచిన మొక్కజొన్నలు



తడిసిన మొక్కజొన్నలను ఆరబోసిన తర్వాత రాసిగా పోస్తున్న రైతులు

ప్రయాణికుల బారి నుంచి రక్షణ కల్పించండి

- నిరసనలో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు

కడప మారుతీనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికుల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ఆళ్లగడ్డకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవరును దువ్వూరు వద్ద ఆపి డ్రైవరు తలపై గాయం చేయడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా బుధవారం ఆర్టీసీ అద్దె బస్సులకు చెందిన పలువురు డ్రైవర్లు కడప ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అద్దె బస్సు కడప, ప్రొద్దుటూరు డిపోకు చెందిన డ్రైవర్లు మాట్లాడారు. స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ అధికమవుతుందన్నారు. దీంతో బస్సులు జనాలతో నిండిపోతున్నాయన్నారు. నిండిపోయిన బస్సులు బస్టాపుల్లో నిలపడం లేదనే కోపంతో ప్రయాణికులు డ్రైవర్లపై దాడులకు దిగడం సరికాదన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమం వద్దకు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు ఆర్టీసీ ఉద్యోగులు (కండక్టర్లు, డ్రైవర్లు) పట్ల సంయమనం పాటించాలన్నారు. స్రీశక్తి పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న సంగతి వాస్తవమేనన్నారు. అయినప్పటికీ ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో ప్రయాణికులకు సేవలందిస్తున్నారన్నారు. అలాంటి వారిపై ప్రయాణికులు దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. సఖ్యతగా మెలగాలని సూచించారు. కాగా, అద్దె బస్సుల డ్రైవర్ల నిరసనతో కడప రీజియన్ పరిధిలోని డిపోలో గల 225 అద్దె బస్సుల్లో 48 బస్సులు బుధవారం ఆగిపోయాయి. దీంతో కడప నుంచి ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, రాయచోటి తదితర ప్రాంతలాకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ మధ్యాహ్నం నుంచి తిరిగి యదావిధిగా బస్సులు తిరిగినట్లు ఆర్టీసీ ఆర్‌ఎం వెల్లడించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి



అద్దెబస్సులు ఆగిపోవడంతో బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు

పిల్లల విద్య, ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

కడప రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలలోని పిల్లల విద్య, ఆరోగ్య విషయాలపై తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలను జడ్జి విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం తెలియజేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉచిత న్యాయసహాయం మొదలగు అంశాలను తెలియజేశారు. అలాగే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలోని పారా లీగల్ వాలంటీర్లకు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో చట్టాలపై జడ్జి అవగాహనను కల్పించారు.

కల్తీ మద్యం గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదం

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జగన్ తన ప్రభుత్వంలో కల్తీ మద్యం లేదని చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జె బ్రాండ్ మద్యం వల్ల వేలాది మంది అనారోగ్యాలతో పాటు అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వైసీపీ ప్రభుత్వంలోని మద్యం పాలసీతో ప్రభుత్వ ఖజానాకు గండి పడి ప్రభుత్వ పెద్దలకు బినామీలకు పెద్ద ఎత్తున మేలు జరిగిందన్నారు. అందువల్లే మద్యం కుంభకోణంలో వరుసగా అరెస్టులు జరుగుతున్నాయన్నారు. టీడీపీ వారు ఈ కల్తీ మద్యం కేసులో వుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే వారిని పార్టీ నుంచి బహిష్కరించారన్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో పాత్ర వున్న తన పార్టీ వారిని ఒక్కరినైనా పార్టీ నుంచి బయటికి పంపారా అని ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ పుల్లయ్య, 39వ వార్డు ఇన్‌చార్జ్ సిద్దయ్య పాల్గొన్నారు.

టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



టమోట గ్రేడింగ్ సెంటర్‌లో రైతులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

లింగాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టమోట ధరలు పతనం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు. లింగాల మం డ లం అంబకపల్లె టమోట గ్రేడింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట దిగుబడులను మార్కెట్‌లో అమ్ముకోలేక రైతులు రోడ్డు పక్కన పడే స్తుండడం బాధాకరమన్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా కేజీ రూ.20తో కొనుగోలు చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

పోరుమామిళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్-19 బాల బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి సుమారు వంద మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన జట్లు రాష్ట్రస్థాయిలో పాల్గొని జిల్లాకు మంచి పేరుతీసుకురావాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రెడ్డి, సుబ్బరాజు, శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, నీలకంఠరావు, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిలో రోగ నిరోధక శక్తికి పొటాష్ వాడాలి

చాపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాగు చేసిన వరి పైరుకు రోగ నిరోధకశక్తి కోసం పొటాష్ తప్పకుండా వాడాలని ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మడూరు గ్రామంలో బుధవారం రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికి ఎకరాకు 90 కేజీలకు మించి యూరియాను వాడితే అగ్గి తెగులు, దోమపోటు సోకుతాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు నాగరాజు మాట్లాడుతూ రైతులు పైర్లకు రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడితే భూసారం తగ్గి నిరుపయోగంగా మారుతుందన్నారు. మండల వ్యవసాయాధికారులు దేవీ పద్మలత, స్వాతి, వీఏఏలు నందిత, సురేశ్, రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు డిపో సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డిలతో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

జమ్మలమడుగు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు దేవగుడి గ్రామంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం స్రీశక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మె ల్యేకు వివరించారు. ప్రధానంగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో బస్సుల కొరత ఉందని, ఎక్కువగా అద్దె బస్సులు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. అలాగే జమ్మలమడుగు-ప్రొద్దుటూరు నాన్‌స్టాప్ సర్వీసులు రద్దు చేసి ఆర్డినరీ సర్వీసులుగా మార్చాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తాడిపత్రి, ప్రొద్దుటూరు, ఆళ్లగడ్డ, మరికొన్ని గ్రామాలకు బస్సులు పెంచాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిసింది. కార్యక్రమంలో కడప రీజినల్ కార్యదర్శి సుధాకర్, రీజినల్ చైర్మన్ శేషన్న, డిపో అధ్యక్షుడు బ్రహ్మం, కార్యదర్శి ఎంజీసీవో రెడ్డి, నాగేంద్ర, గ్యారేజీ కార్యదర్శి వలి, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీలో పదోన్నతులు

- 16 మందికి సీనియర్ అసిస్టెంట్లు, ఏవోలుగా...
- నేడు వారి వారి స్థానాలలో బాధ్యతలు

కడప రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 16 మందికి పదోన్నతులు కల్పించారు. వీరిలో 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు ఏవోలు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించినట్లు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. పదోన్నతులు పొందిన వారికి ఆయా శాఖల్లో ప్లేస్ పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు. ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకామల్లేశ్వరెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు అర్హత కలిగిన ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

పదోన్నతులు పొందిన ఉద్యోగులు వీరే...

సుండుపల్లె ఎంపీపీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న కె.స్వర్ణలతను వల్లూరు ఎంపీపీ కార్యాలయ ఏవోగా, మైదుకూరు మండలంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న ఎంవీ వీరప్రసాద్‌రెడ్డిని చెన్నూరు మండల ఏవోగా, రాజంపేట పీఆర్‌ఐ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను రాజుపాళెం మండల ఏవోగా, లింగాల మండలంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న నరసింహకుమార్‌ను వీఎన్ పల్లె మండల ఏవోగా, పులివెందుల పీఆర్‌ఐ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న శ్వేతవాహనరెడ్డిని ముద్దనూరు మండల ఏవోగా పదోన్నతి కల్పించారు. అలాగే కడప జడ్పీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న శ్రీనివాసరాజును ఖాజీపేట ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, బద్వేల్ పీఆర్‌ఐ సబ్ డివిజన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సి.బాలరాజును పులివెందుల పీఆర్‌ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, నల్లపురెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎన్.విజయను టి.సుండుపల్లె మండల సీనియర్ అసిస్టెంట్‌గా, పులివెందుల ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎ.ఉమాదేవిని పులివెందుల పీఆర్‌ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, తొండూరు ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎ.మనోహర్‌ను పులివెందుల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, వేంపల్లె పీఆర్‌ఐ సబ్ డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న రమేష్‌రెడ్డిని లింగాల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, కడప జడ్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వైపీ నాగేశ్వర్‌రెడ్డిని బద్వేల్ ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, రాజంపేట పీఆర్‌ఐ డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న బి.నరేంద్రనాథ్‌ను రాజంపేటలోని పీఆర్‌ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, బి.కోడూరు మండలంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎస్.గౌస్‌పీర్‌ను పోరుమామిళ్ల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, పెద్దముడియం ఎంపీపీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.కిరణ్‌మూర్తిని రాజుపాళెం ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, మైదుకూరు ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న డి.అన్వర్ బాషాను అదే మండలంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. పదోన్నతులు పొందిన పై ఉద్యోగులందరూ గురువారం వారి వారి స్థానాలలో బాధ్యతలను చేపట్టనున్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



కబడ్డీ పోటీల్లో విజేతగా నిలిచిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు

రామాపురం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటాలని నీలకంట్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) ప్రధానోపాధ్యాయురాలు వనజారెడ్డి సూచించారు. బుధవారం రామాపురం మండలం నీలకంట్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి ఆటల పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ పోటీల్లో కబడ్డీ అండర్-14, 17 బాలుర, బాలికల విభాగంలో రామాపురంలోని ఏపీ ఆదర్శపాఠశాల విన్నర్‌గా నిలువగా, అండర్-14 బాలుర రన్నర్‌గా కొండావాండ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిలిచారని ఆమె వివరించారు

రైల్వేకోడూరులో నేటి నుంచి ..

రైల్వేకోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కే. బుడుగుంటపల్లె పంచాయతీలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు ఉమాశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పిల్లలు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలను అందరూ విజయవంతం చేయాలని ఆయన కోరారు.

11న వైద్య శిబిరం

రైల్వేకోడూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్ఎంఎం హైస్కూలు ఆవరణలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మానవత సంస్థ అధ్యక్షుడు ప్రసాద్ వర్మ బుధవారం తెలిపారు. ఎముకలు, గుండె, డయాబెటిస్ నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. రోగులు తమ పాత రిపోర్టులను తీసుకుని రావాలన్నారు.

వ్యాసరచన పోటీ

పెనగలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఏపీ ఆదర్శ పాఠశాల నాయుడువారిపల్లె ఉన్నత పాఠశాల పెనగలూరులో ఏకలవ్య ఫౌండేషన్ ట్రస్టు ఛైర్మన్ సాయిలక్ష్మి అధ్యక్షతన బుధవారం వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది

రామాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రామాపురం మండలం నీలకంట్రావుపేట ఉర్దూ ఉన్నత పాఠశాల లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఓఆర్‌డబ్ల్యు విజయలక్ష్మి హెచ్ఐవీ వ్యాప్తి నివారణ చర్యలను వివరించారు. హెచ్ఐవీని నివారిద్దాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. పీఎస్టీయూ రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్‌హక్, ఉపాధ్యాయులు, మండల మైనార్టీ టీడీపీ నాయకుడు, గ్రామ ఉపసర్పంచ్ మహబూబ్‌బాషా, కరీముల్లా, విద్యార్థినీ, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఉపాధి ఏపీవోకు అదనపు బాధ్యతలు

రైల్వేకోడూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ఉపాధిహామీ ఏపీవోగా పని చేస్తున్న ఎస్. మృత్యుంజయరావుకు రాజంపేట ఏపీడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ నిశాంత్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజంపేట ఉపాధి క్లస్టర్ ఏపీడీగా పని చేస్తున్న ఎం. ప్రతాప్‌కు అనారోగ్యం కారణంగా 30 రోజుల పాటు శెలవు మంజూరు చేశారు. దీంతో రైల్వేకోడూరు ఉపాధి ఏపీవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ప్రజా సమస్యల పరిష్కారంతో గ్రామాల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

చిట్వేలి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారంతోనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ అన్నారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంపీపీ సభాభవనంలో ఎంపీపీ చంద్ర అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో 80 లక్షల నిధులు ఏమయ్యాయని, వచ్చిన కథనాలపై విచారణ చేయాలని, రాజుకుంట ఎంపీటీసీ నాగార్జున సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధులు ఏమయ్యాయనే విషయంపై కమిటీ ఏర్పాటు చేసి రాబోయే సమావేశానికి పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పనకు గ్రామ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు కృషి చేయాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారి ఈశ్వరయ్య మాట్లాడుతూ మండలంలో 132 మంది ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. 20 పాఠశాలలకు ఆట స్థలాలు లేవని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎస్ఎఫ్‌వో శ్రీనివాసులు మాట్లాడుతూ చిట్వేలి రేంజ్ పరిధిలో పెద్దపులి సంచరిస్తోందని, అటవీ సమీప గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతిలేనిదే అడవిలోకి వెళ్లరాదని సభ్యులకు వివరించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని కోరారు. నేతివారిపల్లె సర్పంచ్ గుండాల్ యాదవ్ మాట్లాడుతూ బీసీ, ఎస్టీ కాలనీల్లో కరెంటు సమస్యలు ఏళ్ల తరబడి పరిష్కరించలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు స్పందనరెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వరలక్ష్మి, సహకార బ్యాంకు డైరెక్టర్ సుమిత్ర, వైస్ ఎంపీపీ సుబ్రమణ్యంరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అన్సర్‌బాషా, నాయకులు ఎల్వీ మోహన్‌రెడ్డి, రామాంజనేయులు, గుత్తి నరసింహ, సీఏ వెంకటేశ్వర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవతోనే ఉపాధ్యాయులకు గుర్తింపు



బయారెడ్డి దంపతులను సన్మానిస్తున్న డీఈవో సుబ్రహ్మణ్యం

రాయచోటిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి):ఉత్తమ సేవలు అందించినప్పుడే ఉపాధ్యాయులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యా శాఖాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధ వారం రాయచోటి పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పని చేస్తూ పదవీ విరమణ పొందిన గడ్డం భయారెడ్డికి సన్మానం చేశారు. డీఈవోతో పాటు ఉపాధ్యాయుల బృందం శాలువాలు, పూలమాలలతో, జ్ఞాపికలను ఇచ్చి ఆయన్ను ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సైరాబాను, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి,చిన్నపిల్లల వైద్యులు భయ్యారెడ్డి, డీసీఈబీ సెక్రటరీ నాగమునిరెడ్డి, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న ఎంపీపీ

నందలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆడపూరు గ్రామం వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం మధ్యాహ్నం ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని, వంటశాలను, స్టోర్‌ను, కూరగాయలను పరిశీలించి, నాసిరకం గా ఉన్నాయని, ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాల ప్రహరీగోడ పడి పోవ డంతో జంతువులు, విషసర్పాలు లోపలకు వస్తున్నాయని, విద్యార్థులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత అని ఉపాధ్యాయులపై మండిపడ్డారు. పంచాయతిరాజ్ డీఈ శ్రీనివాసులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ విజయ పరిశీలించి ప్రహరీ నిర్మాణానికి రూ.4 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అమరేశ్వరి ఆర్ఐ సుశీల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థినికి బహుమతిని అందజేస్తున్న ఎఫ్ఆర్‌వో ధీరజ్

పెనగలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పర్యావరణంతో పాటు, వన్యప్రాణుల సంరక్షణను ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తుంచుకోవాలని చిట్వేలి అటవీశాఖ రేంజ్ అధికారి పి.ధీరజ్ అన్నారు. బుధవారం పెనగలూరు ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్. సహజబ్లెస్సీ అధ్యక్షతన విద్యార్థులకు పర్యావరణం అటవీ జంతువుల సంరక్షణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో సావిత్రి, ఎఫ్‌బీవోలు కేవీ సుబ్బయ్య, పి.సుబ్బరాయుడు పాల్గొన్నారు.

చౌక దుకాణం తనిఖీ



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపట్లలో 24వ నంబరు చౌకదుకాణాన్ని ఆర్డీవో శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరుకులు పంపిణీపై ఆరా తీశారు. ఈ-పాస్ మిషన్‌లో స్టాక్ వివరాలను పరిశీలించారు. 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దే సరుకులు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసులునాయక్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సామాజిక సమస్యలపై దృష్టి సారించాలి

రాజంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు తమ చదువులు, ఉద్యోగాల పైనే కాకుండా సామాజిక సమస్యలపై దృష్టి సారించాలని అన్నమాచార్య విద్యా సంస్థల అధినేత, చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. బుధవారం అన్నమాచార్య యూనివర్సిటీలో జరిగిన ఎంపవరింగ్ అకడమిక్ రీసెర్చ్ అనే అంశంపై జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు తమ చదువులతో పాటు సామాజిక బాధ్యతను గుర్తెరిగి ఇరుగు పొరుగువారికి సహాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా అధ్యాపకుడు కేఆర్ మురళీమోహన్‌ను సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సాయిబాబారెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో తప్పులు ఉపేక్షించం : పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

నందలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి పనుల్లో తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని వచ్చే ఏడాది సామాజిక తనిఖీ సమయానికి ఇది పునరావృతం కాకూడదని పీడీ వెంకటరత్నం హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన 20వ విడత సామాజిక తనిఖీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సం మండలంలో రూ.5,55,24,022 విలువైన పనులు చేయగా, అందులో 76 వేల రూపాయలు దుర్వినియోగం కాగా, బాధ్యుల నుంచి ఆ మొత్తంతోపాటు, రూ.15500 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎస్‌టీఎం సత్యనారాయణ, ఏపీడీ మృత్యుంజయరావు, ఎస్ఆర్‌సీ వెంకయ్య, ఏపీవో మురళీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం పాలైన వారికి సీఎం సహాయనిధి ఆపద్బంధు అని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. పట్టణానికి చెందిన భువనగిరి చెంగల్‌రాయుడు కుటుంబ సభ్యులకు బుధవారం ఆయన రూ.5 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు డీఆర్ఎల్ మణి, రూరల్ అధ్యక్షులు గన్నే సుబ్బనరసయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

'కాణిపాకం' ట్రస్టు సభ్యురాలిగా సంధ్యారాణి

రాజంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా రాజంపేట మండలం ఆకేపాడుకు చెందిన దేవరకొండ సంధ్యారాణిని ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ఆకేపాడుకు చెందిన టీడీపీ సానుభూతిపరుడైన భానుమూర్తిశర్మ సతీమణి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియామకంలో కీలక పాత్ర పోషించిన కూటమి నేతలకు, రాజంపేట నియోజకవర్గ టీడీపీ చమర్తి జగన్‌మోహన్‌రాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

పీఏపీఎస్ ఛైర్మన్ల నియామకం

సుండుపల్లె, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె పీఏసీఎస్ ఛైర్మన్‌గా మడితాడు గ్రామ పంచాయతీకి చెందిన బెల్లాల రమణయ్య, తిమ్మసముద్రం ఛైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి నియమితులయ్యారు. మండలానికి చెందిన మరికొంతమందికి మెంబర్లుగా నియమించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి పార్టీ పెద్దలకు, తమ నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్‌పై అవగాహన



అవగాహన సమావేశంలో స్టేట్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్ ఏసీ సుమయ

రాయచోటి-నేతాజీ సర్కిల్ , అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం రాయచోటి సర్కిల్ స్టేట్ టాక్స్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ షేక్, సుమయ అవగాహన కల్పించారు. ఏకీకృత పన్నుల వ్యవస్థ సాధన, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంలో దాని పాత్రను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చెన్నకేశవప్రసాద్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగాధిపతి ఇందిరాప్రియదర్శిని, మధుసూదన్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రైవేటీకరణతో దళితులకు వైద్యవిద్య దూరం'

రాయచోటిటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): దళితులకు వైద్య విద్యను దూరం చేసేందుకు ప్రభుత్వం మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరిస్తోం దని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ ఆరోపించారు. బుధవారం ఆయన పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేశ్‌కుమార్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు పాలన ధృతరాష్ట్రుడి పాలనలాగా మారిందని ఆరోపించారు.

రాజంపేటలో ఆర్టీసీ కార్మికుల ఆందోళన

రాజంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ హైర్డ్ బస్సు డ్రైవర్‌పై దాడి ఘటనకు నిరసనగా రాజంపేట ఆర్టీసీ డిపోలో కార్మికులు బస్సులను నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

30న అంగన్వాడీల జిల్లా మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్వాడీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి

రాయచోటిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలోని అంగన్వాడీలు, హెల్పర్ల కష్టాలు పడుతున్నారని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ. రాజేశ్వరి అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని బిస్మిల్లానగర్ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సకాలంలో బయోమెట్రిక్ వేయకపోవడంతో పాటు బిల్లులు ప్రభుత్వానికి పంపకపోవడం, తప్పుడు బిల్లులు పెట్టడంతో అంగన్వాడీలకు 5 నెలలుగా కూరగాయల బిల్లులు, 4 నెలలుగా సెంటర్ అద్దెలు అందలేదన్నారు. ఫలితంగా అంగన్వాడీలు మరో నెల రోజుల పాటు బిల్లుల కోసం వేచి ఉండక తప్పడం లేదని ఆవేదన వ్యక్తం ఏశారు. అంగన్వాడీలకు ఆన్‌లైన్ పనిభారం తగ్గించాలని, కాంట్రాక్టర్లు సకాలంలో సెంటర్‌లకు స్టాక్ ఇవ్వకపోవడంపై ఎటువంటి చర్యలు లేవన్నారు. ఫలితంగా ప్రజలు అంగన్వాడీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం, కొత్త సెంటర్లు మంజూరు చేయకపోవడం పేదలకు సంక్షేమాన్ని దూరం చేయడమేనన్నారు. ఐసీడీఎస్ అభివృద్ధికి, అంగన్వాడీల సంక్షేమం కోసం ఈ నెల 30వ తేదీ మదనపల్లిలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభను నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని దశల వారీ పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో జాషువా

రామాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలని, లేకుంటే కూలీల ఖాతాల్లో డబ్బు జమ కాదని ఎంపీడీవో జాషువా తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందికి ఈకేవైసీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 17 వేల మందికి పైగా ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉండగా అందులో 2 వేల మందికి మాత్రమే చేశారన్నారు. ఫీల్డ్ సిబ్బంది గ్రామాలకు వెళ్లి కూలీలతో ఈకేవైసీ చేయించాలన్నారు. ఏపీవో పెంచలయ్య, ఈసీ ఓబులేసు, టీఏలు సురేంద్రనాయుడు, చంద్రశేఖర్, నాగభూషణం, శివానందరెడ్డి, కళావతి, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీవోఏల వినతి

రామాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సమస్య లు పరిష్కరించాలని బుధ వారం వీఓఏలు ఏపీఎంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్కొక్క గ్రా మంలో దాదాపు 30 నుంచి 40 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, వారి సమాచారం అంతా తాము పుస్తకాల రూపంలోనూ, మొబైల్ రూపంలోనూ భద్ర పరచాల్సి ఉంటుందని, స్వయం సహాయక సంఘాల్లో ఏ చిన్న పొరపాటు జరిగినా మొదట వీవోఏలను ప్రశ్నిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు.తమకు సరైన సదుపాయాలు కల్పించకపోవడం దారుణమైన విషయమన్నారు. ఫైవ్‌జీ మొబైల్స్ అందించాలని, వేతన బకాయిలు చెల్లించాలని, ఆన్‌లైన్ పని భారం తగ్గించాలని, కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని పేర్కొన్నారు.

చేనేతలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

గాలివీడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు హామీ ఇచ్చిన పథకాలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వీరభాస్కర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుంత మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ప్రతి నేత కుటుంబానికి రూ.25 వేలు చేనేత భరోసా ఇవ్వాలని, 50 ఏళ్లు పైబడిన కార్మికులకు పింఛన్ మంజూరు చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా ఇప్పటి వరకు అమలు కాలేదన్నారు. పథకాలు అమల్లో ఉన్నాయని మంత్రులు చెబుతున్నప్పటికీ, జిల్లా చేనేత జౌళిశాఖ అధికారులు జీవోలు జారీ కాలేదని స్పష్టం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గాలివీడు మండల అధ్యక్షుడు శిబ్యాల వెంక్రటమణ, మండల కార్యవర్గ సభ్యులు ఓర్సు ఆంజనేయులు, ఓర్సు వెంకట్రమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలి

గాలివీడు, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): రేషన్ పంపిణీ పారదర్శకంగా జరగాలని తహసీల్దార్ భాగ్యలత డీలర్లను ఆదేశించారు. బుధవారం ఆమె మండలంలోని 22, 24, 25 నెంబర్ రేషన్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, నిల్వ వివరాలను పరిశీలించి కార్డుదారులతో సరుకుల పంపిణీ విధానంపై మాట్లాడారు. వారికి అందుతున్న సరుకుల పరిమాణం, ధరలు, కార్డులో ఉన్న సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ సకాలంలో పంపిణీ అయ్యేలా, అర్హులైన వారికి సరుకులు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. 65 ఏళ్లు నిండిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని డీలర్లను ఆదేశించారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి : సీఐటీయూ

రాజంపేట టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఈనెల 26న జరిగే ఏపీ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ రమణ పిలుపునిచ్చారు. బుధవారం రాజంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ తక్షణమే అమలు చేయాలన్నారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఒకరికి ఉద్యోగవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ మరింత మంది కార్మికులను నియమించి పనిభారం తగ్గించాలని కోరారు.

పెనగలూరులో చిరు జల్లులు

పెనగలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపరితల ఆవర్తనం కారణంగా మండలంలోని చాలా ప్రాంతాల్లో కొంతసేపు ఉరుములతో కూడిన చిరు జల్లులు కురిశాయి. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో మబ్బులను చూసి భారీ వర్షాలు కురుస్తాయనుకున్న ప్రజల అంచనాలు చిరుజల్లులతోనే సరిపెట్టాయి.


సమాజ సేవలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజ్మతుల్లా

వీరబల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజ్మతుల్లా పిలుపునిచ్చారు. బుధవారం పెద్ద మాదిగపల్లె ఎలిమెంటరీ స్కూల్‌లో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కృష్ణయ్య మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలన్నారు. ఎంపీడీవో జవహర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలా పొందాలన్న అంశంపై గ్రామీణుల్లో అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవాభావం అలవర్చుకోవాలని తెలిపారు. ప్రోగ్రాం ఆఫీసర్లు భాస్కర్, రఘురామయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్యాంసుందర్‌రెడ్డి, చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న బీసీ సంఘం నేత విజయ భాస్కర్

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతి పురస్కరించుకొని లక్కిరెడ్డిపల్లె జెడ్పీ బాలుర పాఠశాలలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయ భాస్కర్ ఆధ్వర్యంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు వాల్మీకి రామాయణంపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, బీసీ సంఘం నాయకులు రామచంద్ర, రవిఆచారి, మసూద్, షాదుల్లా, మహమ్మద్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

మానవతా విలువలపై సమావేశం

రాజంపేట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మనావతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజంపేట పట్టణం సరస్వతిపురం శ్రీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ అమ్మినేని ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో మానవతా విలువలపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షులు వేణుగోపాల్‌నాయుడు, ఛైర్మన్ శ్రీనివాసులునాయుడు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహ మానవుల పట్ల చిన్నతనం నుంచే విద్యార్థులు మానవతా విలువలు కలిగి, తమవంతు సహాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ కన్వీనర్ అబ్దుల్లా, శ్రీనివాసులునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడు మృతి



మహేంద్ర (ఫైల్‌పొటో)

రైల్వేకోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధానదారిలో మంగళవారం రాత్రి 11 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వేకోడూరు పోలీసుల వివరాల మేరకు.. రైల్వేకోడూరు పట్టణంలోని రంగనాయకుల పేటకు చెందిన బొక్కసం మహేంద్ర (27) అనే యువకుడు తన మోటారు సైకిల్‌లో బుధ వారం తిరుపతి వైపు వెళుతుండగా వెనక వైపు నుంచి ఓ లారీ అతి వేగంగా వచ్చి ఢీకొని వెళ్లింది. దీంతో మహేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఎడమ చేయి పూర్తిగా తొలగిపోయింది. నడుము భాగంలో బలమైన గాయాలయ్యాయి. లారీని అతి వేగంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతదేహాన్ని రైల్వేకోడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బుధవారం ఉదయం వైద్యులు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు శవాన్ని అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ కిందపడి రైతు..



జనార్దన్ మృతదేహం

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): సంబే పల్లె మండలం శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లికు చెందిన రైతు నల్లబోతుల జనార్ధన (50) మిల్లర్ రిపేర్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ కింద పడి బుధవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు... జనార్ధన్ తన సొంత ట్రాక్టర్‌తో ఉలవపంట సాగు కోసం పొలానికి వెళ్లినట్లు తెలిపారు. మిల్లర్ బ్లేడ్లు ఊడిపోవడంతో ట్రాక్టర్ ఆపి బిగిస్తూ ఉండగా అనుకోకుండా ట్రాక్టర్ వెనక్కు రావడంతో రైతు ట్రాక్టర్ కిందపడినట్లు తెలిపారు. పొలం దగ్గరలో ఉన్న గ్రామస్థులు గుర్తించి అతన్ని చికిత్స నిమిత్తం రాయ చోటి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు కలరు. ఇంటి యజమాని మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. అడవికమ్మపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడు..



ధనంజయ (ఫైల్‌పొటో)

పీలేరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధ వారం పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇందిరమ్మ కాలనీలో నివాసముం టున్న పి.ధనుంజయ(29) జేసీబీ ఆపరేటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఏడేళ్ల క్రితం పావనితో వివాహమైంది. తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరగడంతో పాటు పిల్లలు కలగకపోవడంతో ధనంజయ తీవ్ర మనస్థాపానికి గురయ్యేవాడు. ఈ నేపథ్యంలో వారం రోజుల క్రితం భార్య తన పుట్టింటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న అతను ఆదివారం ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో మంగళవారం రాత్రి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్‌ఐ రహీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆత్మహత్య చేసుకున్న రాజస్థాన్ వాసి..

బి.కొత్తకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం రాజస్థాన్ నుంచి వచ్చిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం బి.కొత్తకోటలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు... రాజస్థాన్‌లోని బాలహోత్రా జిల్లా, శివన గ్రామానికి చెందిన ఉత్తంసింగ్ కుమారుడు విక్రంసింగ్(26) బి.కొత్తకోటలోని పోకనాటివీధిలో ఓ అద్దెగదిలో వుంటూ స్థానికంగా ఉన్న ఓ ఫ్యాన్సీ స్టోర్‌లో పనిచేసుకుంటున్నాడు. మంగళవారం షాపుకు సెలవు కారణంగా రూములోనే వున్నాడు. ఇతని చెల్లెలు ఫోన్‌చేయగా ఎంతకూ తీయకపోవడంతో అనుమానం వచ్చి ఇక్కడే ఉంటున్న తమ బంధువును రూం వద్దకు పంపింది. అతను వెళ్లి చూడగా నైలాన్‌తాడుతో ఫ్యానుకు ఉరివేసుకొని మృతిచెంది వుండటం గమనించాడు. మృతుడి చెల్లెలు నిర్మలకన్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ వికటించి వృద్ధురాలు..



గంగులమ్మ మృతదేహం

మదనపల్లెటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తుంటి ఎముక విరిగి ఆపరేషన్ చేయిం చుకున్న ఓ వృద్ధురాలి ప్రాణాలకే ఎసరు వచ్చింది. వైద్యుడు చేసిన ఆపరేషన్ వికటించి ఆమె మృతి చెందింది. వివరా ల్లోకి వెళితే.. చిత్తూరు జిల్లా బైరెడ్డిపల్లె మండలం ఘాజీపేటకు చెందిన గంగప్ప భార్య గంగులమ్మ(60) ఇంట్లో కాలుజారి కిందపడటంతో తుంటి ఎముక విరిగింది. దీంతో ఆమెను మదనపల్లె సొసైటీ కాలనీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఆమెకు శస్త్రచికిత్స చేయడానికి ఆరోగ్యశ్రీ కింద ఈ నెల 4న ప్రభుత్వ అనుమతులు రావడంతో ఆ ఆస్పత్రిలో కాకుండా పట్టణంలోని సుందరరాజ్ పెట్రోల్‌బంక్ ఎదురుగా వున్న వీధిలోని మరో ప్రైవేటు ఆస్పత్రిలో ఈ నెల 7న గంగులమ్మకు ఇద్దరు వైద్యులు శస్త్రచికిత్స చేశారు. ఆరోజునే గంగులమ్మకు ఆపరేషన్ వికటించి ఆయాసం ఎక్కువ కావడంతో, ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ నేపథ్యంలో బుధవారం గంగులమ్మ మృతికి వైద్యులే కారణమంటూ ఆమె కుటుంబీకులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వన్‌టౌన్ సీఐ మహ్మద్‌రఫీ, ఎస్‌ఐ శివకుమార్ ప్రైవేటు ఆస్పత్రికి చేరుకుని బాధితులను విచారించారు. కాగా ఈ సంఘటనపై కేసు నమోదు కానట్లు తెలిసింది.

విద్యార్థిపై మూకుమ్మడి దాడి

- 108లో మదనపల్లెకు తరలింపు

బి.కొత్తకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌లో బుధవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. అంగళ్లలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకునే విద్యార్థుల బృందం హార్సిలీహిల్స్‌కు వెళ్లారు. వీరిలో కొందరి మధ్య వివాదం తలెత్తింది. పరస్పరం ఘర్షణ పడ్డారు. వీరిలో ములకలచెరువు మండలం పర్తికోటకు చెందిన వివేక్‌పై మిగతా విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేశారు. దీంతో వివేక్‌కు రక్త గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన విద్యార్థి ఆస్పత్రిలో చేరాడు. స్థానిక అవుట్‌పోస్టు సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. కాగా హార్సిలీహిల్స్‌లో పర్యాటకుల రక్షణకు పోలీసు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోనే తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

వామ్మో.. కుక్కలు..!

- పట్టణాల్లో ఎటుచూసినా గుంపులే
- ద్విచక్రవాహనదారులను వెంటపడుతున్న వైనం
- జిల్లాలో 3 వేల మందికి కుక్కకాటు
- అత్యధికంగా మదనపల్లెలో 806 మంది
- బెంబేలెత్తుతున్న ప్రజలు ● అధికార యంత్రాంగం విఫలం



రాయచోటిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వీధికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోజురోజుకు కుక్కకాటుకు గురయ్యేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గుంపులుగా చేరి ప్రజలపై దాడి చేస్తుండడంతో జనం భయాందోళన చెందుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ప్రతిరోజు ఏదో ఒక చోట ఎవరో ఒకరు కుక్కకాటు బారిన పడుతూనే ఉన్నారు. కుక్కల బెడద నివారించేందుకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలోని ప్రధాన పట్టణాలైన రాయచోటి, మదనపల్లి, పీలేరు, రాజంపేట, కోడూరు, తంబళ్లపల్లె, వాయల్పాడు లాంటి ప్రాంతాల్లో పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుక్కలు స్వైరవిహారం చేస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధుల వెంబడి గుంపులుగా తిరుగుతున్న కుక్కలు చిన్న, పెద్ద అనే తేడా లేకుండా దాడి చేసి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆడుకుంటున్న చిన్నపిల్లలపై రక్తస్రావమయ్యేలా దాడి చేస్తున్నాయి. దీంతో పిల్లల తల్లిదండ్రులు హుటాహుటిన ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. అంతేకాకుండా వీధుల్లో గుంపులుగా చేరి ద్విచక్ర వాహనదారులను వెంటపడుతుండడంతో వారు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా జూన్ 1 నుంచి ఆగస్టు 31వ తేది వరకు 2,929 మంది కుక్కకాటుకు గురైనట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇందులో 1841 మంది పురుషులు, 1088 మంది మహిళలు గాయపడిన వారిలో ఉన్నారు. ఇందులో అత్యధికంగా మదనపల్లి ప్రాంతంలో 806 మంది, రాయచోటి ప్రాంతంలో 295 మంది, చిట్వేలి ప్రాంతంలో 272 మందికి కుక్కకాటుకు గురికావడం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెలు, మేకలపై సైతం కుక్కలు మూకుమ్మడిగా దాడి చేస్తున్నాయి. ఏదేమైనప్పటికీ జిల్లాలో కుక్కలను అదుపు చేయడంలో సంబంధిత అధికారులు శ్రద్ధ చూపడం లేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాయచోటిలో గుంపులు గుంపులుగా ఉన్న కుక్కలు

కుక్కలతో భయమేస్తోంది

- నాగేశ్వరరావు, రాయచోటి



వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. చిన్న పిల్లలను స్కూల్‌కు, ట్యూషన్‌కు ఒంటరిగా పంపించాలంటే భయమేస్తోంది. మున్సిపల్ అధికారులు తగు చర్యలు తీసుకొని కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి.

వాహనాల వెంటపడుతున్నాయి

- శ్రీరాములు, బాధితుడు, రాయచోటి

పట్టణంలో రాత్రి, పగలు అనే తేడా లేకుండా కుక్కలు వాహనాల వెంటపడుతున్నాయి. అసలు ఒంటరిగా వెళ్లలేకున్నాం. మున్సిపల్ అధికారులు కొన్ని వీధులకే పరిమితమయ్యారు. కుక్కలకు వ్యాక్సిన్ వేయడం లేదు.



టీకాలు అందుబాటులో ఉన్నాయి

- డాక్టర్ లక్ష్మీనరసయ్య, డీఎంఅండ్‌హెచ్‌వో

జిల్లా వ్యాప్తంగా ప్రతి పీహెచ్‌సీ సెంటర్‌లో టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్కకాటుకు గురైనా, గాయాలపాలైనా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యుల సూచనల మేరకు టీకాలు వేయించుకోవాలి. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

బస్సు ఆపలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దౌర్జన్యం

- ఆపై దాడి చేసిన యువకులు
- ఆలస్యంగా వెలుగుచూసిన వైనం



కండక్టర్‌పై దౌర్జన్యం చేసేందుకు బస్సు ఎక్కుతున్న యువకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాజంపేట డిపోకు చెందిన ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై ప్రయాణికులు దౌర్జన్యం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాల్లోకెళ్తే.. పల్లె వెలుగు బస్సు ఈ నెల 5వ తేదిన సాయంత్రం రాజంపేట నుంచి తిరుపతికి వెళ్తోంది. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరు మీదుగా 125 మంది ప్రయాణికులతో వెళ్తుండగా శెట్టిగుంట దగ్గర ప్రయాణి కులు బస్సును ఆపారు. కానీ సీట్లు లేకపోవడంతో డ్రైవర్ బస్సు ఆపలేదు. దీంతో ఆగ్రహించిన శెట్టిగుంటకు చెందిన కొందరు యువకులు ద్విచక్ర వాహనాలతో వెంబడించి బస్సు డ్రైవర్‌పై దాడికి దిగడమే కాకుండా కండక్టర్‌పై దుర్భాషలాడారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో బుధవారం హల్‌చల్ చేయడంతో రైల్వేకోడూరు పోలీసులు విచారిస్తున్నారు. జరిగిన సంఘటనపై విచారించేందుకు రాజంపేట ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌లను పోలీస్‌స్టేషన్‌కు రమ్మన్నామని, వారు వచ్చిన తర్వాత పూర్తి సమాచారం తెలుస్తుందని ఎస్‌ఐ వీఎల్ ప్రసాద్‌రెడ్డి వివరించారు. కాగా రాజంపేట డిపోలో బస్సు డ్రైవర్‌పై దాడికి నిరసనగా బస్సు డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి / ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యమే కారణమా ?



మృతిచెందిన రంజిత్‌కుమార్

మదనపల్లెటౌన్/నిమ్మనపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో కోసుకుపోయిన రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులు చేయని కారణంగా ఓ నిండు ప్రాణం గాల్లో కలసి పోయింది. వివరాల్లోకి వెళితే.. మదనపల్లె- నిమ్మనపల్లె మధ్య ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పలుచోట్ల గుంతలు పడడంతో పాటు, ఇరుకు రోడ్డు వుండటంతో ఇరువైపులా రోడ్డు కోసుకుపోయింది. ఈ క్రమంలో నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ కుమ్మరపల్లెకు చెందిన చంద్రశేఖర్, రెడ్డిరాణి దంపతుల కుమా రుడు రంజిత్‌కుమార్ (20) డిగ్రీ చదువుకుంటూ, ఓ ఫోటో స్టూడియోలో ఎడిటింగ్ కోర్సు నేర్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం రంజిత్‌కుమార్ ద్విచక్రవాహనంలో తవళం నుంచి మదనపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలో వశిష్ట హైస్కూల్ వద్ద ముందు వెళుతున్న ఆర్టీసీ బస్సును రంజిత్ ఓవర్‌టేక్ చేశాడు. తారు రోడ్డు దిగి, తిరిగి రోడ్డు ఎక్కుతున్న రంజిత్ ద్విచక్రవాహనం బెర్మ్ సరిగ్గా లేకపోవడంతో జారి పడిపోయింది. ఈ ఘటనలో రంజిత్ తారు రోడ్డుమీద పడిపోవడం, వెనక వస్తున్న ఆర్టీసీ బస్సు రంజిత్ శరీరంపై ఎక్కడం ఒక్కసారిగా జరిగిపోయాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రంజిత్‌కుమార్‌ను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించి రంజిత్ మృతిచెందాడు. దీంతో తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రభుత్వాస్పత్రికి వెళ్లి మృతుడి కుటుంబీకులను ఓదార్చారు. కాగా ఆర్‌అండ్‌బీ అధికారుల నిర్లక్ష్య వైఖరితోనే విద్యార్థి ప్రాణాలు పోయాయని బీవైఎస్ అధ్యక్షుడు పునీత్ ఆరోపించారు.

డ్రోన్ కెమెరాతో నిఘా

- ఐదుగురు కోడిపందెంరాయుళ్ల అరెస్టు

రామసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, జూదం అరికట్టేందుకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి చేపట్టిన డ్రోన్‌తో తనిఖీలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచిన రామసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో పూలగుంట్లపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో అక్రమంగా జరుగుతున్న కోడి పందేలను గుర్తించామన్నారు. కోడి పందేల స్థావరం వద్దకు వెళ్లిన డ్రోన్‌ను చూడగానే, కోడిపందెం రాయుళ్లు ద్విచక్ర వాహనాలను అక్కడే వదిలేసి కొండలు, గుట్టల గుండా పరుగులు తీశారు. వీరిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని సంఘటన స్థలం నుంచి ఆరు ద్విచక్రవాహనాలు, ఒక పందెం కోడి స్వాధీనం చేసుకున్నామన్నారు. పారిపోయిన నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.



కోడిపందేలు ఆడుతున్న స్థావరం వద్దకు డ్రోన్‌ను పంపుతున్న ఎస్‌ఐ

అనుమానాస్పద స్థితిలో చేనేత కార్మికుడు మృతి

మదనపల్లెటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ చేనేత కార్మికుడు మృతి చెందిన సంఘటన మదనపల్లె పట్టణంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. కలకడ మండలం నడిమిచెర్లకు చెందిన రెడ్డెప్ప కుమారుడు సుంకరరెడ్డి(42) మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో చేనేత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సుంకరరెడ్డి గత కొంత కాలంగా మద్యానికి బానిసై, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో సుంకరరెడ్డి భార్య జయమ్మ కుమార్తె, అల్లుడితో కలసి మూడు రోజుల క్రితం తిరుమల వెళ్లారు. బుధవారం మదనపల్లెకు తిరిగి వచ్చి ఇంటి తలుపులు వేసి వుండటంతో భర్త సుంకరరెడ్డిని పలుమార్లు పిలిచింది. ఎంతసేపటికి ఇంటి తలుపులు తెరవకపోవడంతో పాటు ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండడంతో వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇంటి తలుపులు పగులకొట్టి లోనికి వెళ్లి పరిశీలించగా సుంకరరెడ్డి మృతదేహం కనపడింది. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతిగా మద్యం సేవించి మృతి చెందాడా అన్న విషయం పోలీసుల విచారణలో తేలాల్సి వుంది.

విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందించాలి: డీఈవో

రాయచోటిటౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన దృక్పథం పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్ష ఉపయోగపడుతుందని డీఈవో సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులతో కలిసి చెకుముకి సంబరాల గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచిని పెంపొందించేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు తోడ్పడతాయన్నారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పనిసరిగా ఈ సంబరాల్లో పాల్గొనేలా చొరవ చూపాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాబాఫకృద్దీన్ మాట్లాడారు. జిల్లాలోని 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు సైన్స్ సంబరాల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ సంబరాలు పాఠశాల స్థాయిలో అక్టోబరు 18న, మండల స్థాయిలో నవంబరు 1న జిల్లా స్థాయిలో 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14వ తేదీల్లో నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రకాశ్‌రెడ్డి, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, ఐఈడీ కోఆర్డినేటర్ జనార్ధన్, ప్రధానోపాధ్యాయుడు శివయ్య, రెడ్డెన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళపై చీటింగ్ కేసు నమోదు

గాలివీడు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం చేసిన బాబాబీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని నూలివీడు గ్రామం వడ్లపల్లికి చెందిన రాళ్లపల్లి బాబాబీ అనే మహిళ ఎస్పీ కార్యాలయంలో పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి నూలివీడు గ్రామం నాగూరువాండ్లపల్లెకు చెందిన రామచంద్ర కుమార్తె శారద వద్ద బంగారం రూపంలో రూ.7 లక్షలు, నగదుగా రూ.11.50 లక్షలు మొత్తం రూ.18.50 లక్షలు తీసుకొని ఎలాంటి ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేసిందని బాధితురాలు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఘటనపై గాలివీడు పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్లకు ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన విద్యార్థులు

సుండుపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఉమ్మడి కడప జిల్లా టీంలకు సుండుపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ రాధారాణి తెలిపారు. బుధవారం కడప జిల్లాలోని పోరుమామిళ్లలో ఎస్‌జీఎఫ్ అండర్-19 విభాగంలో రాష్ట్ర జట్టు ఎంపికల కోసం సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సాఫ్ట్‌బాల్ అండర్-19 బాలికల విభాగంలో బేబీ, బాలుర విభాగంలో ఆంజనేయులు, వెంకటేశ్వర్లు తమ ప్రతిభను చాటి సెలెక్టర్ల దృష్టిలో పడ్డారు. బేస్‌బాల్ బాలికల విభాగంలో శ్రీలత, బేబి, బాలుర విభాగంలో భరత్ సత్తా చాటారు. దీంతో వీరికి సెలెక్టర్లు జిల్లా జట్లలో స్థానం కల్పించారు. వెంకటేశ్వర్లను బేస్‌బాల్ జట్టులో స్టాండ్ బైగా తీసుకున్నారు.

విద్యార్థి ఘటనపై విచారణ



విద్యార్థితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గత నెలలో రిషివాటిక గురుకులంలో జరిగిన సంఘటనలో శేషాద్రిరెడ్డి అనే విద్యార్థికి కంటి చూపు పోయింది. ఈ మేరకు బుధవారం డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీనరసయ్య విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహించి చూపు పూర్తిగా దెబ్బతినిందన్నారు. తల్లిదండ్రులు తమ బిడ్డకు న్యాయం చేయాలని జిల్లా అధికారిని కోరారు. ఈ మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో లక్ష్మీనరసయ్య పిల్లవాడికి న్యాయం జరిగేలా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఒక్కరోజు వాన

- ఎకరాకు రూ.5వేలు నష్టం
- తడిసిన మొక్కజొన్నలు
- తగ్గిన ధర... రైతుల ఆవేదన

రాజుపాలెం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం అష్ట కష్టాలు పడి పంటలు పండించిన రైతన్నలను నష్టాలు ఏదోక రూపంలో వెంటాడుతూనే ఉన్నాయి. ఖరీఫ్‌లో సాగు చేసిన మొక్కజొన్న పంటను ఆరబెట్టుకునేందుకు రోడ్లపైకి తోలారు. అయితే సోమవారం ఉదయం భారీ వర్షం పడడంతో మొక్కజొన్నలు తడిసి ముద్ద య్యాయి. దీంతో మరుసటిరోజు తెరిపి రావడంతో పంటను ఆరబెట్టుకు నేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. ఇక ధర ఒక్క రోజులోనే క్వింటా రూ.2200 పలుకుతున్న మొక్కజొన్నలు రూ.1700కు పడిపోయాయి. దీంతో రైతుకు ఎకరాకు రూ.5వేలు నష్టం వచ్చిందని, మూడునెలలు పంటను అన్నివిధాలుగా రక్షించుకుని తీరా చేతికొచ్చే సమయంలో ఒక పక్క రేటు లేకపోవడం, మరో పక్క వర్షానికి నానడంతో రైతులు దిగులు చెందుతు న్నారు. ఇంకా దాదాపు 300 ఎకరాల్లో పంట కోత దశలో ఉంది. వర్షం పడకపోతే నూర్పిళ్లు జరుగుతాయని,. అధిక వర్షం పడితే పంట దెబ్బతిం టుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండురోజులు వర్షం పడకపోతే కొంత మేరగట్టెక్కవచ్చని రైతులు అంటున్నారు.2 తడిచిన మొక్కజొన్నలు


తడిసిన మొక్కజొన్నలను ఆరబోసిన తర్వాత రాసిగా పోస్తున్నరైతులు
తడిసిన మొక్కజొన్నలు

బుల్లెట్‌వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరి దుర్మరణం


హాజీవల్లి, రామ్మోహన్ మృతదేహాలు, (ఫైల్ ఫొటోలు)

ముద్దనూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఎర్రగుంట్ల రోడ్డులోని కొత్తపల్లె సమీపంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత బుల్లెట్ వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలిలా... చింతకొమ్మదిన్నె మండలం సుగాలి బిడికి గ్రామానికి చెందిన రామ్మోహన్(35), చిలమకూరు గ్రామానికి చెందిన హాజీవలి (31) లారీ డ్రైవర్లు. వీరు ముద్దనూరులో భోజనం చేసుకొని బుల్లెట్ వాహనంపై చిలమకూరు వద్ద నున్న సిమెంట్ ఫ్యాక్టరీ వద్దకు వెళుతున్నారు. ముద్దనూరు వైపు నుంచి బళ్లారి నుంచి చైన్నెకి ఐరన్ వోర్ మట్టిని తరలిస్తున్న లారీ కొత్తపల్లె గ్రామ సమీపంలోని సున్నపురాళ్లపల్లె క్రాస్ వద్ద బుల్లెట్‌ను వెనుక వైపు ఢీకొంది. దీంతో హాజీవలి సంఘటనా స్థలంలో మృతి చెందగా, రామ్మోహన్‌ను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు లారీని గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


నూర్జహాన్ మృతదేహం

చాపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అండ్లగుత్తి నూర్జహాన్ (59) అనే మహిళ బుధవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాల మేరకు.. నూర్జహాన్ తన ఇంటి బయట బట్టలు ఉతుకుతుండగా చెక్కబోర్డు (నీళ్ల మోటారుకు సంబంధించిన బోర్డు)పై నీళ్లు పడ్డాయి. గమనించిన ఆమె బోర్డుకు ఉన్న ప్లగ్‌ను తాకడంతో విద్యుత్ షాక్‌కు గురై ఈ ప్రమాదం జరిగిందన్నారు. నూర్జహాన్ మృతితో ఆమె భర్త మహమ్మద్, కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు


శిక్ష పడ్డ ఖైదీతో పోలీసులు

కడప క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ప్రకాశ్ నగర్‌లోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసుకు సంబంధించి నిందితుడు మల్లికార్జునకు జీవిత ఖైదుతో పాటు వంద రూపాయలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని బుధవారం తీర్పు నిచ్చినట్లు కడప వన్‌టౌన్ సీఐ రామ క్రిష్ణ తెలిపారు. సీఐ వివరాల మేరకు... కడప మారుతీనగర్‌కు చెందిన మల్లికార్జున ఈడీ ఎంఎస్ స్కానింగ్ సెంటరు నిర్వహిస్తుండే వాడు. అతని వద్ద కంప్యూటరు ఆపరేటర్‌గా కడప నిరంజన్‌నగర్‌కు చెందిన చిట్టివేలి భవాని శంకర్ పనిచేస్తుండేవాడు. ఈక్రమంలో మల్లికార్జున భార్యతో భవాని శంకర్‌కు వివాహేతర సంబంధం ఉందని అనుమానించేవాడు. ఈ క్రమంలో 2023 నవంబరు 11న మల్లికార్జున తన ఆఫీసు వద్దకు రావాలని భవానీ శంకర్‌ను పిలిపించుకుని ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తనతో తెచ్చుకున్న మచ్చుకత్తితో భవానీ శంకర్‌ను విచక్షణారహితంగా నరికి హత్య చేశాడు. మృతుడి భార్య బాబాబి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ నాగరాజు కేసు నమోదు చేసి, మల్లికార్జునను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేసు పూర్వపరాలు పరిశీలించిన జడ్జి యామిని నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు వంద రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. ఈకేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కదీరున్నీసా వాదించారని సీఐ తెలిపారు.

కోడిపందెంరాయుళ్ల అరెస్టు

కొండాపురం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిపాడు గ్రామంలో నలుగురు కోడిపందెం రాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వెంకయ్యకాలువ రోడ్డులో కోడిపందెం ఆడు తున్న నలుగురి నుంచి రూ.3,850 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనపరుచుకున్నట్లు కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం

కడప క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప నగరం మాసాపేటకు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి అదృశ్యమైనట్లు రిమ్స్ సీఐ రామక్రిష్ణారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప మాసాపేటకు చెందిన హర్షవర్దన్ కడప నగరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం స్నేహితులతో కలిసి రాజంపేట రోడ్డులోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద దిగి అదృశ్యమయ్యాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కుమార్తె కనిపించడం లేదని...

పోరుమామిళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తె కనిపించడం లేదని రజక వీధికి చెందిన మహిళ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోరుమామిళ్లలోని రజకవీధిలో నివాసం ఉంటున్న 17 సంవత్సరాల బాలిక మంగళవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

ప్రయాణికుల బారి నుంచి రక్షణ కల్పించండి

- నిరసనలో ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు


నిరసన వ్యక్తం చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లతో మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి


అద్దెబస్సులు ఆగిపోవడంతో బస్టాండులో వేచి ఉన్న ప్రయాణికులు

కడప మారుతీనగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికుల బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల ఆళ్లగడ్డకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవరును దువ్వూరు వద్ద ఆపి డ్రైవరు తలపై గాయం చేయడం దారుణమన్నారు. ఇందుకు నిరసనగా బుధవారం ఆర్టీసీ అద్దె బస్సులకు చెందిన పలువురు డ్రైవర్లు కడప ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అద్దె బస్సు కడప, ప్రొద్దుటూరు డిపోకు చెందిన డ్రైవర్లు మాట్లాడారు. స్త్రీశక్తి పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి బస్సుల్లో ప్రయాణం చేసే ప్రయాణికుల సంఖ్య రోజురోజుకూ అధికమవుతుందన్నారు. దీంతో బస్సులు జనాలతో నిండిపోతున్నాయన్నారు. నిండిపోయిన బస్సులు బస్టాపుల్లో నిలపడం లేదనే కోపంతో ప్రయాణికులు డ్రైవర్లపై దాడులకు దిగడం సరికాదన్నారు. ప్రభుత్వం ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా నిరసన కార్యక్రమం వద్దకు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు గోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారు ఆర్టీసీ ఉద్యోగులు (కండక్టర్లు, డ్రైవర్లు) పట్ల సంయమనం పాటించాలన్నారు. స్త్రీశక్తి పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణికుల సంఖ్య పెరుగుతున్న సంగతి వాస్తవమేనన్నారు. అయినప్పటికీ ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో ప్రయాణికులకు సేవలందిస్తున్నారన్నారు. అలాంటి వారిపై ప్రయాణికులు దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. సఖ్యతగా మెలగాలని సూచించారు. కాగా, అద్దె బస్సుల డ్రైవర్ల నిరసనతో కడప రీజియన్ పరిధిలోని డిపోలో గల 225 అద్దె బస్సుల్లో 48 బస్సులు బుధవారం ఆగిపోయాయి. దీంతో కడప నుంచి ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, రాయచోటి తదితర ప్రాంతలాకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొన్నారు. అయినప్పటికీ మధ్యాహ్నం నుంచి తిరిగి యదావిధిగా బస్సులు తిరిగినట్లు ఆర్టీసీ ఆర్ఎం వెల్లడించారు.

పిల్లల విద్య, ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలి

కడప రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలలోని పిల్లల విద్య, ఆరోగ్య విషయాలపై తగు జాగ్రత్తలు వహించాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం, పరిశీలన గృహాలను జడ్జి విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆహారం, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ వారి బాలల సంరక్షణకు స్నేహపూర్వక న్యాయసేవల పథకం తెలియజేశారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉచిత న్యాయసహాయం మొదలగు అంశాలను తెలియజేశారు. అలాగే జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలోని పారా లీగల్ వాలంటీర్లకు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో చట్టాలపై జడ్జి అవగాహనను కల్పించారు.

కల్తీ మద్యం గురించి జగన్ మాట్లాడటం హాస్యాస్పదం

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జగన్ తన ప్రభుత్వంలో కల్తీ మద్యం లేదని చెప్పడం హాస్యాస్పదమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో జె బ్రాండ్ మద్యం వల్ల వేలాది మంది అనారోగ్యాలతో పాటు అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వైసీపీ ప్రభుత్వంలోని మద్యం పాలసీతో ప్రభుత్వ ఖజానాకు గండి పడి ప్రభుత్వ పెద్దలకు బినామీలకు పెద్ద ఎత్తున మేలు జరిగిందన్నారు. అందువల్లే మద్యం కుంభకోణంలో వరుసగా అరెస్టులు జరుగుతున్నాయన్నారు. టీడీపీ వారు ఈ కల్తీ మద్యం కేసులో వుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే వారిని పార్టీ నుంచి బహిష్కరించారన్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో పాత్ర వున్న తన పార్టీ వారిని ఒక్కరినైనా పార్టీ నుంచి బయటికి పంపారా అని ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, మాజీ కౌన్సిలర్ పుల్లయ్య, 39వ వార్డు ఇన్‌చార్జ్ సిద్దయ్య పాల్గొన్నారు.

టమోటా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి


టమోట గ్రేడింగ్ సెంటర్‌లో రైతులతో మాట్లాడుతున్న తులసిరెడ్డి

లింగాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): టమోట ధరలు పతనం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు. లింగాల మం డ లం అంబకపల్లె టమోట గ్రేడింగ్ సెంటర్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట దిగుబడులను మార్కెట్‌లో అమ్ముకోలేక రైతులు రోడ్డు పక్కన పడే స్తుండడం బాధాకరమన్నారు. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలే మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా కేజీ రూ.20తో కొనుగోలు చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులు

పోరుమామిళ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామిరెడ్డి తెలిపారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో అండర్-19 బాల బాలికలకు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి సుమారు వంద మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ ఎంపికైన జట్లు రాష్ట్రస్థాయిలో పాల్గొని జిల్లాకు మంచి పేరుతీసుకురావాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వర్‌రెడ్డి, సుబ్బరాజు, శ్రీకాంత్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు, నీలకంఠరావు, విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరిలో రోగ నిరోధక శక్తికి పొటాష్ వాడాలి

చాపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాగు చేసిన వరి పైరుకు రోగ నిరోధకశక్తి కోసం పొటాష్ తప్పకుండా వాడాలని ఆత్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి అన్నారు. మదూరు గ్రామంలో బుధవారం రైతులకు భూసార పరీక్ష ఫలితాల కార్డులను అధికారులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికి ఎకరాకు 90 కేజీలకు మించి యూరియాను వాడితే అగ్గి తెగులు, దోమపోటు సోకుతాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఉపసంచాలకులు నాగరాజు మాట్లాడుతూ రైతులు పైర్లకు రసాయనిక ఎరువులను ఎక్కువగా వాడితే భూసారం తగ్గి నిరుపయోగంగా మారుతుందన్నారు. మండల వ్యవసాయాధికారులు దేవీ పద్మలత, స్వాతి, వీపీఏలు నందిత, సురేశ్, రైతులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు డిపో సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డిలతో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు

జమ్మలమడుగు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వారు దేవగుడి గ్రామంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వం స్త్రీశక్తి పథకం అమలు చేసినప్పటి నుంచి ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మె ల్యేకు వివరించారు. ప్రధానంగా జమ్మలమడుగు ఆర్టీసీ డిపోలో బస్సుల కొరత ఉందని, ఎక్కువగా అద్దె బస్సులు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. అలాగే జమ్మలమడుగు-ప్రొద్దుటూరు నాన్‌స్టాప్ సర్వీసులు రద్దు చేసి ఆర్డినరీ సర్వీసులుగా మార్చాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తాడిపత్రి, ప్రొద్దుటూరు, ఆళ్లగడ్డ, మరికొన్ని గ్రామాలకు బస్సులు పెంచాలని ఎమ్మెల్యే సూచించినట్లు తెలిసింది. కార్యక్రమంలో కడప రీజినల్ కార్యదర్శి సుధాకర్, రీజినల్ చైర్మన్ శేషన్న, డిపో అధ్యక్షుడు బ్రహ్మం, కార్యదర్శి ఎంజీసీవో రెడ్డి, నాగేంద్ర, గ్యారేజీ కార్యదర్శి వలి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో తప్పులు ఉపేక్షించం : పీడీ

నందలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని.. వచ్చే ఏడాది సామాజిక తనిఖీ సమయానికి ఇది పునరావృతం కాకూడదని పీడీ వెంకట రత్నం హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన 20వ విడత సామాజిక తనిఖీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సం మండలంలో రూ.5,55,24,022 విలువైన పనులు చేయగా, అందులో 76 వేల రూపాయలు దుర్వినియోగం కాగా, బాధ్యుల నుంచి ఆ మొత్తంతోపాటు, రూ.15,500 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి, ఎస్‌టీఎం సత్యనారాయణ, ఏపీడీ మృత్యుంజయరావు, ఎస్ఆర్‌సీ వెంకయ్య, ఏపీవో మురళీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీలో పదోన్నతులు

- 16 మందికి సీనియర్ అసిస్టెంట్లు, ఏవోలుగా...
- నేడు వారి వారి స్థానాలలో బాధ్యతలు

కడప రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 16 మందికి పదోన్నతులు కల్పించారు. వీరిలో 11 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు ఏవోలు ఉన్నారు. ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించినట్లు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ తెలిపారు. పదోన్నతులు పొందిన వారికి ఆయా శాఖల్లో ప్లేస్ పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు. ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకామల్లేశ్వరెడ్డి, శ్రీనివాసులరెడ్డిలు అర్హత కలిగిన ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించడంపై హర్షం వ్యక్తం చేశారు.

పదోన్నతులు పొందిన ఉద్యోగులు వీరే...

సుండుపల్లె ఎంపీపీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న కె.స్వర్ణలతను వల్లూరు ఎంపీపీ కార్యాలయ ఏవోగా, మైదుకూరు మండలంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న ఎంవీ వీరప్రసాద్‌రెడ్డిని చెన్నూరు మండల ఏవోగా, రాజంపేట పీఆర్ఐ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న గౌరీశంకర్‌ను రాజుపాళెం మండల ఏవోగా, లింగాల మండలంలో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న నరసింహకుమార్‌ను వీఎన్ పల్లె మండల ఏవోగా, పులివెందుల పీఆర్ఐ సబ్ డివిజన్‌లో సీనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న శ్వేతవాహనరెడ్డిని ముద్దనూరు మండల ఏవోగా పదోన్నతి కల్పించారు. అలాగే కడప జడ్పీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న శ్రీనివాసరాజును ఖాజీపేట ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, బద్వేల్ పీఆర్ఐ సబ్ డివిజన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సి.బాలరాజును పులివెందుల పీఆర్ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, నల్లపురెడ్డిపల్లె జడ్పీ హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.విజయను టి.సుండుపల్లె మండల సీనియర్ అసిస్టెంట్‌గా, పులివెందుల ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎ.ఉమాదేవిని పులివెందుల పీఆర్ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, తొండూరు ఏంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎ.మనోహర్‌ను పులివెందుల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, వేంపల్లె పీఆర్ఐ సబ్ డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న రమేష్‌రెడ్డిని లింగాల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, కడప జడ్పీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వైవీ నాగేశ్వర్‌రెడ్డిని బద్వేల్ ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, రాజంపేట పీఆర్ఐ డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న బి.నరేంద్రనాద్‌ను రాజంపేటలోని పీఆర్ఐ సబ్ డివిజన్ సీనియర్ అసిస్టెంట్‌గా, బి.కోడూరు మండలంలో టైపిస్టుగా పనిచేస్తున్న ఎస్.గౌస్‌పీర్‌ను పోరుమామిళ్ల ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, పెద్దముడియం ఎంపీపీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వి.కిరణ్‌మూర్తిని రాజుపాళెం ఎంపీపీ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా, మైదుకూరు ఎంపీపీ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న డి.అన్వర్ బాషాను అదే మండలంలోనే సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించారు. పదోన్నతులు పొందిన పై ఉద్యోగులందరూ గురువారం వారి వారి స్థానాలలో బాధ్యతలను చేపట్టనున్నారు.

పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య

రామసముద్రంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ● ఇరవై ఏళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన రోడ్డు పనులు



దుకాణాల ముందు వినియోగదారుల రద్దీ - మెయిన్ రోడ్డు పక్కనే నాటిన కొత్త విద్యుత్ స్తంభాలు

రామసముద్రం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతోంది. మండల కేంద్రానికి వివిధ రకాల పనులపై వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో వారు తీసుకువచ్చే ద్విచక్రవాహనాలు నిలపడానికి స్థలం లేక దుకాణాల ముందు ఉంచడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. మరోపక్క దుకాణాల ముందు ద్విచక్రవాహనాలు నిలిపితే పోలీసులు వాహనదారులకు జరిమానాలు విధిస్తున్నారు. దీంతో చిల్లర దుకాణాల్లో సరుకులు కొనడానికి వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా తమ వ్యాపారంపై కూడా ప్రభావం పడుతోందని వ్యాపారులు వాపోతున్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగే వారపు సంతకు పల్లెల నుంచి తరకారి తెచ్చే రైతులు, కొనడానికి వచ్చే వినియోగదారులతో రద్దీ ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. పండగ రోజులైతే గంటల తరబడి ట్రాఫిక్ ఉంటోంది. మదనపల్లె, పుంగనూరు, శ్రీనివాసపురం, ముళబాగల్‌కు వెళ్లే దారిలో ఉన్న అంబేడ్కర్ కూడలిలో బస్సులు చాలా సేపు నిలిపి ఉండడంతో వచ్చిపోయే వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంబేడ్కర్ కూడలి నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు బస్సులు, ఆటోలు నిలిపి ఉండడంతో ట్రాఫిక్ పెరుగుతోంది. మూలిగే నక్కపై తాటికాయ పడినట్లు ఇటీవల కొత్త విద్యుత్ లైన్ స్తంభాలను మెయిన్ రోడ్డు పక్కనే వేడయంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగి ట్రాఫిక్ సమస్య మరింతగా పెరిగింది. ప్రస్తుతం మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు కేవలం ఇరవై అడుగుల వెడల్పు మాత్రమే ఉంది. ఇందులో మురికి నీటి కాల్వలు పోను సుమారుగా 15అడుగులు వెడల్పు మాత్రమే ఉంది. ఇరవై ఏళ్ల కిందట దిగువ పేట నుంచి ఎగువ చెక్‌పోస్టు వరకు రోడ్డు విస్తరణకు పరిధి గుర్తించి గుర్తులు వేశారు. ఇంతవరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టలేదు. మండల కేంద్రం నుంచి సుమారు 15 కిలోమీటర్లు వరకు వందకు పైగా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వస్తూపోతూ ఉంటారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని మండల కేంద్రంలో రోడ్డు విస్తరణకు త్వరగా చర్యలు తీసుకోవాలని రైతులు, దుకాణ దారులు వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు మెమోలు



పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ

మదనపల్లె టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పర్యటించి మరమ్మతు చేయించాల్సిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నిర్లక్ష్యం చేస్తున్నారని, ఇటువంటి వారికి మోమోలు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కొన్ని గ్రామాల్లో తాగునీటి పైప్ లైన్లు పగిలి నీరంతా లీకేజి అవుతోందని, కొన్నిచోట్ల మురుగునీటి కాల్వల వద్ద తాగునీరు కలుషితం అవుతోందన్నారు. గ్రామాల్లో పర్యటించి మరమ్మతులు చేపట్టాలన్నారు. వర్షాకాలం కారణంగా తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించి, బ్లీచింగ్ చేయించాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులకు నిచ్చెనలు ఏర్పాటు చేయించాలన్నారు. జ్వరాలు, డయేరియా ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి దిశగా భారత్ అడుగులు



సమావేశంలో మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే పార్థసారథి

మదనపల్లె, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పాలన నేటికి 11 ఏళ్లు పూర్తయిందని బీజేపీ రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు సాయి లోకేష్ అన్నారు. పట్టణంలో బుధవారం ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ 11ఏళ్లలో భారత్ అభివృద్ధి వైపు వికసిత్ భారత్ లక్ష్యంగా 2047కి ఆర్థిక అభివృద్ధి సాధించి ప్రపంచ దేశాల్లో విశ్వగురువుగా మొదటి స్థానంలో నిలబడేలా పాలనసాగుతోందన్నారు. కదిరి ఎమ్మెల్యే మిట్టా పార్థసారథి మాట్లాడుతూ అమెరికా ఆంక్షలు తర్వాత ప్రధాని పిలుపు మేరకు గ్రామ స్థాయిలో ఇంటింటా స్వదేశీ పేరుతో స్వదేశీ వస్తువులను ప్రోత్సహించడం ద్వారా కలిగే ప్రయోజనాలను సోషల్ మీడియా, వీధినాటకాలు, ర్యాలీల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. చేతి వృత్తులు, హస్తకళలపై ఆధార పడి జీవిస్తున్న వారి జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రతి ఒక్కరూ స్వదేశీ వస్తువులను అమ్మేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, శాసనమండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకియా ఖానం, జిల్లా ప్రధాన కార్యదర్శి పులిరెడ్డి నరేంద్రకుమార్ రెడ్డి, జిల్లా కన్వీనర్ రామ్మోహన్, చీర్ల శ్రీనివాస్ యాదవ్, రవికుమార్, ఆదిలక్ష్మమ్మ, ఓసూరి కిరణ్ కుమార్, పిల్లస్వామినాయక్, బండి ఆనంద్, పురుషోత్తం, శోభారాణి, బాలజ్యోతి, కిరణ్‌కుమార్, పూల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరికి తప్పిన ప్రాణాపాయం

బి.కొత్తకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వరదనీటిలో కొట్టుకుపోతూ గొర్రెల కాపరి రక్షించబడ్డాడు. కొత్తఉడియం వాసి నర్సింహులు గొర్రెలు తోలుకుని సూరపువాండ్లపల్లె అటవీప్రాంతానికి వెళ్లాడు. సాయంత్రం భారీ వర్షం కురవడంతో కొత్తఉడియం శివారులో కాజ్‌వేపై నీటి ప్రవాహం ఎక్కువైంది. గొర్రెలను దాటిసుతండగా కాలుజారి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కేకలు విన్న స్థానికులు కొందరు నీటిలోకి దూకి గొర్రెల కాపరిని కాపాడారు.

జీఎస్టీపై అవగాహన అవసరం



పీలేరులో ప్రచార పత్రాలతో అధికారులు, కళాశాల సిబ్బంది - నిమ్మనపల్లిలో జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పీలేరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకువచ్చిన జీఎస్టీ మార్పులపై అవగాహన పెంచుకోవాలని ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఎం.పి.అనివాశ్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. జీఎస్టీ సంస్కరణలపై బుధవారం పులిచెర్ల మండల జీఎస్టీ, విద్యాశాఖ, సచివాలయ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు వెసలుబాటు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో సంస్కరణలు తెచ్చిందని, వాటిని ఆకళింపు చేసుకుని తమ ప్రాంత ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలన్నారు. పులిచెర్ల మండల జీఎస్టీ అధికారి సాబ్జాన్, ఎంఈఓలు సిద్దరామయ్య, పోకల తాతయ్య మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణల కారణంగా తగ్గిన స్టేషనరీ సామగ్రి ధరల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వివిధ శాఖల విభాగాధిపతులు, అధ్యాపక, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. పీలేరులోని సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. వేర్వేరు కార్యక్రమాల్లో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు వెం.వెంకటరమణయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సుధాకర్ రెడ్డి, అధ్యాపకులు సహదేవ, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఉపశమనం

బి.కొత్తకోట, అక్టోబరు8(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ విధానంతో ప్రజలందరికీ ఉపశమనం కలిగిందని నగర పంచాయతీ కమిషనర్ జీవీ పల్లవి పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజిలో వాణిజ్యపన్నుల శాఖ అధికారుల ఆధ్వర్యంలో విద్యార్థులకు జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. కేంద్రవిధానంతో జనం ఎలా లబ్ధిపొందవచ్చనే అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్‌షుకూర్, ఎంఈఓ భీమేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై భారం పడకుండా జీఎస్టీని తగ్గించినట్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. విద్యార్థులు జీఎస్టీ ద్వారా తగ్గిన వస్తువుల ధరల నమూనాను ముద్రించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జీఎస్టీ తగ్గుదల తరువాత నిత్యావసర సరుకులు చాలా చౌకగా వస్తున్నట్లు తెలిపారు. వీలైనంత వరకు ప్రజలకు జీఎస్టీపై అవగాహన రావాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సన్మానం



డాక్టర్లు చంద్రశేఖర్, సరస్వతమ్మను సన్మానిస్తున్న టీడీపీ, ప్రజాసంఘ నేతలు

పీలేరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో పీలేరు ఆస్పత్రి జిల్లా స్థాయి అవార్డు సాధించినందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, ఆర్ఎంఓ డాక్టర్ సరస్వతమ్మను బుధవారం పలువురు సన్మానించారు. పీలేరు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పోలిశెట్టి సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆటో యూనియన్ నేత బోదేషావలి, ఉపాధ్యాయ సంఘ నేత రమణారెడ్డి, టీడీపీ నేతలు శ్రీనివాసులు, షాదాద్ పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయ బోర్డు సభ్యురాలిగా శ్రీవాణి



గుర్రంకొండ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా వి.శ్రీవాణి నియమితులయ్యారు. గుర్రంకొండ మండలం మర్రిపాడు వాసి వి.జయసూరిబాబు భార్య వి.శ్రీవాణి. గతంలో ఈయన మర్రిపాడు సర్పంచ్‌గా పనిచేశారు. నల్లారి కుటుంబానికి విధేయులుగా గ్రామంలో టీడీపీ ఎదుగుదలకు విశేష కృషి చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్టానం కాణిపాకం దేవస్థానం పాలకమండలి సభ్యురాలిగా ఆమెను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అనారోగ్యంతో టీడీపీ నేత రమణ మృతి



పెద్దమండ్యం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి) మండల టీడీపీ నేత డీవీ రమణ (65) అనారోగ్యంతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ధనరాజుగారిపల్లి వాసి డీవీ రమణ పార్టీ ఆవిర్భావం నుంచీ కొనసాగారు. మండల టీడీపీ అధికార ప్రతినిధిగా పని చేశారు. టీడీపీ బలోపేతం కోసం కృషి చేసి గుర్తింపు పొందారు. అయన మృతి పట్ల కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేసిన వారిలో టీడీపీ నేతలు జిట్టా వెంకటరమణ, నార రామచంద్రయ్య, హసీంసాబ్, రెడ్డిపీర, మైసూరి శ్రీనివాసులు, బిక్కా మధుకర, వేణుగోపాల్‌రెడ్డి, నాగరాజ, కుళాయి రెడ్డి, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నేతలు ఉన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

మదనపల్లె టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): పప్పిరెడ్డిగారిపల్లెలో రూ.20లక్షలతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా భూమి పూజ చేశారు. బుధవారం పప్పిరెడ్డిగారిపల్లెలో పూజ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్లు నాణ్యత పాటించాలన్నారు. పీఆర్ ఏఈ రమణ, టీడీపీ ఇన్‌చార్జి జంగాల రమణ, శశి, రాజా, సోమశేఖర్, వేణు, గురునాథ్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో నిమ్మనపల్లి విద్యార్థుల ప్రతిభ

నిమ్మనపల్లి అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సంస్థ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో నిమ్మనపల్లి జడ్పీహెస్కూల్ విద్యార్థులు ఇద్దరు ప్రతిభ కనపరిచినట్లు హెచ్ఎం అంజాద్ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సంస్థ నిర్వహించిన క్విజ్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు కె.నిఖిల్, ఎ.చైతన్యకు కన్సలేషన్ బహుమతులు వచ్చినట్లు తెలిపారు. మదనపల్లి డివిజన్ స్థాయిలో సీటీఎంలో జరిగిన చెస్ పోటీల్లో అండర్ 17 విభాగంలో నిఖిల్, అండర్ 14 విభాగంలో ఉదయ్‌కుమార్ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

కలకడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బాలయ్యగారిపల్లె పంచాయతీ కేవీరెడ్డిపల్లెకు సమీపంలో జూదం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. వారి నుంచి రూ.2600 నగదు, సెల్ ఫోన్, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలీసులకు పట్టుబడిన నిందితుల్లో కలకడ మండలానికి చెందిన సుధాకర్, వెంకటేశ్వరరావు, రెడ్డెప్ప, సంబేపల్లె మండలానికి చెందిన శివాజీని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కురబలకోట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రో చాన్సెలర్ ద్వారకనాథ్ పేర్కొన్నారు. అంగళ్లు సమీపంలోని డీమ్డ్ టు బీ మిట్స్ యూనివర్శిటీలో లయన్స్ క్లబ్, ప్రభుత్వ ఆస్పత్రి, స్కంద సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలు సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన, దంత, నేత్ర వైద్య శిబిరాలను నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయాల్లో రక్తం అందక ఎందరో మరణిస్తున్నారని, అలాంటి వారికి ఇలాంటి రక్తదాన శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం అలవర్చు కోవాలన్నారు. చాలా మందిలో రక్తదానంపై అపోహ ఉందని, దానిని తొలగించుకోవాలన్నారు. కళాశాలకు చెందిన 120 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామనాథమ్, వైస్ ప్రిన్సిపాల్ కమాల్ బాష, డీన్ తులసీ రామ్ నాయుడు, బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ చెన్నయ్య, వైద్యులు నివేదిత, మేఘన, రెడ్డి అఖిల్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ప్రసాద్

బి.కొత్తకోట, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చూపారు. ఈనెల 7న పలమనేరు మండలం గంగవరంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో బి.కొత్తకోట గురుకులం విద్యార్థులు పి.సంతోష్, బి.గౌతం పోల్‌వాల్ట్‌లో, రెడ్డిసాయి పరుగులో సత్తాచాటారు. ఈ నెల 11న తూర్పుగోదావరి జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని ప్రిన్సిపాల్ ప్రసాద్, పీడీ వెంకటశివప్రసాద్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ముమ్మరంగా రీ సర్వే పనులు



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న అధికారులు

కలికిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రికుంటపల్లె గ్రామంలో రీ సర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు రీ సర్వే డీటీ వెంకట్రమణారెడ్డి, మండల సర్వేయర్ రెడ్డెప్ప, వీఆర్వో సురేష్‌కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులను వీరు పరిశీలించారు. మర్రికుంట పల్లెలో మాత్రమే రీసర్వే జరగాల్సి వుందని, ఈ గ్రామంలో మంగళవారం నుంచి సర్వే ప్రారంభించామన్నారు. రెండు రోజుల్లో 240 ఎకరాల్లో సర్వే పూర్తి చేశామన్నారు. మొత్తం గ్రామంలో 5086 ఎకరాలు సర్వే చేయాల్సి వుంద న్నారు. ఇందులో 2023 మంది రైతుల భూములు, 1094 ఎకరాల ప్రభుత్వ భూములను గుర్తి స్తామన్నారు. ఈ భూములను 18 బ్లాకులుగా విభజించి ఒక్కో బ్లాకుకు దాదాపు 285 ఎకరాలు కేటాయించామని వివరించారు. రీ సర్వే కోసం ఐదు టీములను ఏర్పాటు చేశామని, ఒక్కో టీములో ఇద్దరు సర్వేయర్లు, ఒక వీఆర్వో, ఒక వీఆర్‌ఏని నియమించామన్నారు. పారదర్శకత కోసం గ్రామంలోని రైతులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశామని, రైతులందరినీ రీ సర్వేలో భాగస్వాములను చేస్తున్నామన్నారు. మరుసటి రోజు ఏఏ టీములు ఏఏ సర్వే నంబర్లలో సర్వే చేయబోతున్నదీ ముందు రోజు సాయంకాలానికి గ్రూపులో సమాచారమిస్తున్నామని, రైతులు ఆ మేరకు అందుబాటులో వుండి సమస్యలు లేకుండా అక్కడికక్కడే పరిష్కరించుకోవాలని కోరారు.

ఖోఖో విజేతగా తంబళ్లపల్లె జట్టు

మదనపల్లె టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మదనపల్లె డివిజన్ స్కూల్‌గేమ్స్ పోటీలు ఖోఖోలో అండర్-14 విభాగంలో తంబళ్లపల్లె జట్టు విజేతగా నిలిచింది. స్థానిక జడ్పీహైస్కూల్లో నిర్వహించిన పోటీల్లో 15 మండలాల నుంచి జట్లు పాల్గొన్నాయి. ఇందులో ఖోఖోలో తంబళ్లపల్లె బాలికల జట్టు విజేతగా నిలవగా, రామసముద్రం జట్టు రన్నర్స్‌గా నిలిచింది. అండర్ 17లో రామసముద్రం జట్టు విజేతగా, తంబళ్లపల్లె జట్టు రన్నర్స్‌గా నిలిచింది. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి నాగరాజ, ఝాన్సీ రాణి, డివిజన్ కార్యదర్శి భద్రయ్య, శివశంకర్, పీడీలు నరేష్, బాలాజి, పార్థ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.